# రామలక్ష్మణులు

[ కథ ]

= శ్రీ 'జమదగ్ని' =

నారాయణంగారి ఇంట్లో రెండుగాళ్లుగాని బండి ఎద్దు చనిపోవడం ఊరంతటికీ ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగించింది.

ఎద్దు అంటే ఎద్దా అది! కేవలం నందీశ్వరుని అపరావతారం. రామన్నా, లక్ష్మన్నా నడుమూల చుట్టూ నల్లని తోలుపట్టాలతో, తలలకు సికమార్లతో, ముఖాన కుచ్చులతో, మెడల్లో మువ్వలపట్టెడలతో, కాళ్లకు వెండ్రుకలతాళ్లతో, ఖంగుఖంగున కంచు గంటలు మోగించుకుంటూ బండి లాగుతుంటే గోలోకాని కంతటికీ యువరాజు లనిపించుకునేవి. అట్లాంటి జతలోని లక్ష్మన్న అకస్మాత్తుగా రాత్రి మేతమేసి పడుకున్నది పడుకున్నట్లు తెల్లవారేటప్పటికి దీర్ఘనిద్ర పోయిందంటే ఎవరికి ఆశ్చర్యంగాదు? ఎవరికి విచారకరం గాదు? ప్రతివారూ ముక్కుమీద వేలు వేసుకునేవారే! ప్రతివారూ "అయ్యో, ఎంత పాపం, ఎంత పాపం" అని దుఃఖించేవారే!!

అలవాటుచొప్పున ఉదయాన్నే గొడ్లపాకలోకి వెళ్లిన నారాయణం పడిఉన్న లక్ష్మన్నను చూచి 'అలో లక్ష్మణా' అని తన చిన్నకొడుకు చనిపోయినట్లు బావురుమని ఏడ్చాడు. రాత్రివఱకూ ఏవిధమైన జబ్బూ లేని లక్ష్మన్న ఇట్లా చనిపోవడంతో అతనికి ప్రపంచమే శూన్యమనిపించింది. భగవంతుడే లేడనిపించింది. ఆ గాఢదుఃఖంలో అతను నిత్యకృత్యాల విషయమే మఱచిపోయాడు. భర్తదుఃఖతీవ్రతను గమనించిన అన్నపూర్ణ నిశ్చేష్టురాలై అరుగుమీద అట్లాగే చతికిలబడిఉంది.

ఆనాడు ఊరంతా నారాయణం ఇంటిముందే పోగయింది. నారాయణందుఃఖాన్ని తాముగూడా పంచుకుని విచారించారేగాని ఒక్కరూ అతనికి కర్తవ్యం జ్ఞాపకం చెయ్యలేకపోయారు.

ఇంతలో బారెడు పొద్దెక్కింది. పాకలో ఎక్కడి గొడ్లు అక్కడే ఉన్నాయి. పాలవేళ దాటిపోవడంతో లేగదూడలు అరవడం మొదలుపెట్టాయి. పలుపులు లాక్కుంటూ అరుస్తున్న దూడల్ని చూచి కట్టుకొయ్యలదగ్గఱ నిలబడలేక అటూ ఇటూ తిరుగుతూ తల్లులుగూడా అరుస్తున్నాయి. ఆ అరుపులన్నీ రామన్న అరుపులతో కలిసి, పోయిన లక్ష్మన్నకోసం తోటిజంతువులు పలుకుతున్న సానుభూతివాక్యాలుగానే భాసిస్తున్నాయి. ఆ సమయంలో పొలంపనిలో పాలేళ్లకు సాయపడడానికి రాత్రే వెళ్లిన గొడ్లకాపరి బుడ్డాళ్లిద్దఱూ పశువులను తోలుకువెళ్లడానికి వచ్చారు. వచ్చీరావడంతో ఇంటిముందు మూగిన జనాన్నీ, చచ్చిపడిఉన్న లక్ష్మన్ననూ చూచి నిర్ఘాంతపోయారు. తలమీద చేతులు పెట్టుకుని గొంతుకుకూర్చుని లోపల్లోపల క్షోభపడుతున్న నారాయణాన్ని చూచి అడుగుకదపలేకపోయారు.

గాలి సాగిసాగి ఒక్కమాటు స్తంభించిపోయినట్లుగా ఎందుకో అకస్మాత్తుగా అతినిశ్శబ్దత ఏర్పడిపోయింది. రాలిన సూదిచప్పుడుగూడా వినబడే ఆ నిశ్శబ్దతను నారాయణంపక్క ఇంటి రాఘవయ్య రెండునిమిషాలు గడిచేటప్పటికి సహించలేకపోయాడు. అతను కల్పించుకుని బుడ్డాళ్లను చూచి "ఇంకా చూస్తా

లేంరా? అంత పొద్దోడిచింది ఆపట్టం లేదూ! ఒకరు పోయి దూడల్ని విడవండి. ఇంకోరు వెళ్లి వెట్టివాళ్లను కేకేసుకురండి" అని అన్నాడు.

వెట్టివాళ్లమాట వినేటప్పటికి అంత దుఃఖంలోనూ నారాయణంఒళ్లు గజగజా వణికింది. అక్కడ కూర్చునిఉండే "ఎందుకు మామా?" అనిమాత్రం అనగలిగాడు. వెంటనే రాఘవయ్య "ఎందుకేమిటి నారాయణం! చచ్చిన గొడ్డును ఇట్లా ఇంటిముందు పెట్టుకుని ఎంతసేపు కూర్చుంటాం? పోయిన ఎద్దు నందిలాంటిదే అనుకో! అది మళ్లీ బ్రతికిరాదుగదా! దానికోసం ఇంత దుఃఖపడి ప్రయోజనం ఏమిటి? దానికీ, మనకూ ఋణం తీరిపోయింది. అంతే!" అంటూ ఆకాలానికి అవసరమైనంత మాత్రంగా వైరాగ్యం బోధించాడు.

వీళ్ల సంభాషణ వినకుండానే గొడ్లకాపరి వాళ్లిద్దఱూ ఎవరికి చెప్పబడ్డ పనులమీద వాళ్లు వెళ్లిపోయారు.

రాఘవయ్య చెప్పిందంతా విన్నాడో లేదో కాని నారాయణం చిట్టచివఱకు "వాళ్లువస్తే మా వాములదొడ్డిలో గొయ్యి తవ్వమని చెప్పు మామా!" అని ఊరుకున్నాడు. ఆమాట విన్న అక్కడి వాళ్లందఱూ ఆశ్చర్యపడి అతనివంకే చూచారు. ఎన్నడూ కంటనీరుపెట్టని రాఘవయ్యకూడా ఆ సమయంలో కన్నీళ్లు కార్చాడు.

ఇక తరువాతిపనులన్నీ రాఘవయ్యే పూనుకొని చేయించాడు. మరణించిన లక్ష్మన్నను మెత్తగా గడ్డి వేసిన బండిమీదికి ఎక్కించారు. ఊళ్లో బంతిపూలన్నీ - పచ్చవీ ఎఱ్ఱవీగూడా పసుపు కుంకుమలతోబాటు లక్ష్మన్నమృతశరీరాన్నే అలంకరించాయి. డోలూ, సన్నాయీ పుచ్చుకుని మేళగాళ్లు వచ్చారు. ఒక్క పెద్దపాలేరుతప్ప పొలంనుంచి నారాయణం పాలేళ్లుగూడా వచ్చారు. ముందు మేళగాళ్లూ, తరువాత బండీ, బండివెంబడే రామన్నా, దానిపక్కనే నారాయణం, అతనివెంబడే ఊళ్లోజన మందఱూ ఆబాలగోపాలం అత్యధిక విషాదాన్ని ప్రకటిస్తూ మహారాజవైభవంతో లక్ష్మన్నశరీరాన్ని ఊరేగించారు.

రెండుజాములవేళ అయేటప్పటికి నారాయణం వాములదొడ్లో లక్ష్మన్నమృతశరీరానికి ఖననసంస్కారం పూర్తి అయింది. కన్నకొడుకును పోగొట్టుకొన్నంత దుఃఖంతో ఆచోటు విడవలేకవిడవలేక రాఘవయ్య బలవంతంమీద నారాయణం ఇంటిముఖం పట్టాడు.

౨

ఆ ఊరంతటికీ నారాయణం పెద్దరైతు. రెండు మూడు తరాలనుంచీ ఆ కుటుంబానికి ఆరు అరకల వ్యవసాయం ఉంటూ వచ్చింది. నారాయణం ఆ ఆస్తిని ఏమాత్రమూ పెంచలేదుగాని ఉన్నది పాడుచెయ్యకుండా, వచ్చింది పదిమందికీ పెట్టుతూ ధర్మప్రభువనిపించుకుంటున్నాడు. అతను ఎన్నడుగాని ఎవరితోనూ అడిగింది లేదు అని అనలేదు. ఆ ఊళ్లో అతని సొమ్ము తిననివాడు లేడంటే అతిశయోక్తికాదు. ఇంత ఆస్తి ఉండి ఇంత గుణవంతుడైనప్పటికీ పూర్వజన్మలో ఏం పాపం చేసుకున్నాడో ఏమో అతనికి సంతానం మాత్రం కలగలేదు. తనకు సంతానం లేదుగదా అని నారాయణం దత్తపుత్త్రవ్యామోహంలో పడిపోక అనుకూలవతియైన భార్యసహకారంతో తన ఇంట పుట్టిన గోసంతానమే సంతానంగా ఎంచుకుని తన గుండెలోని పితృభావసర్వస్వాన్నీ వానియెడ లే చూపుతూ పరోపకారబుద్ధితో కాలక్షేపం చేస్తున్నాడు. అటువంటి నారాయణం అల్లారుముద్దుగా తన చేతులమీదుగా పెంచుకున్న రామలక్ష్మణుల్లో లక్ష్మణుడు అంత పసివయస్సులో చనిపోవడం కేవలం అధర్మవిజృంభణం కాకపోతే మరేమిటి?

ఈ విషయం ఆ ఊళ్లో ప్రతివాణ్నీ హృదయ దఘ్నంగా కదిలించివేసింది. అందుకనే ఆ నాడు అంతమందీ అట్లా తమ విచారాన్ని సూచిస్తూ లక్ష్మన్న బండివెంట వెళ్లారు.

ఆ ఊళ్లోకల్లా ఈ కదలికను ఏమాత్రమూ పొందంది ఒకేఒక వ్యక్తి. అతడు నారాయణం పెద్ద పాలేరువెంకాయి. వెంకాయి నారాయణం తండ్రి

దగ్గఱ పనిచేసిన సీతాయికొడుకు. నారాయణంతండ్రి చనిపోయేముందు కొడుకును దగ్గఱకుపిల్చి ఒకేఒకమాట చెప్పాడు: "నాన్నా! సీతాయి తన బ్రదుకంతా మన సేవలోనే వినియోగించాడు. వెంకాయి కొంచెం దురుసువాడుగదా అని వాణ్ని నువ్వు తోసెయ్యకు. వాణ్ని పోషించే భారం నామీద ఉన్నది. ఆభారం నీమీద పెట్టుతున్నాను." తండ్రి చెప్పిన ఈ మాటను అణుమాత్రమూ దాటకుండా నారాయణం వెంకాయిని తన కొలువులోనే ఉంచుకున్నాడు.

లోకంలో మతిమంతుల మనస్సుల్ని కలవర పఱచే విషయాల్లో ఇదొకటి. ఈ జగత్తు నెందుకో బ్రహ్మదేవుడు ద్వంద్వమయంచేశాడు. సూర్యదేవుని భార్యగా ఛాయాదేవి ఏర్పడింది. చీకటిని పోగొట్టే వెలుగునిచ్చే దీపాన్ని అంటిపెట్టుకుని నీడ ఉంటుంది. క్షమాశీలయైన భూదేవికడుపున ఇతరుల ప్రాణాలను మింగేసే విషపుచెట్లు అనేకం పుట్టుతున్నాయి. అలాగే సీతాయికడుపున వెంకాయి పుట్టాడు.

ఎంత చెడ్డా వెంకాయి సీతాయికొడుకు కాక పోలేదు. పనిపట్టిన సమయంలో వెంకాయి ఎన్నడూ ఒళ్లుదాచుకోవడం ఎఱగడు. పదిమంది చెయ్యవలసిన పనిని తాను ఒక్కడే చేస్తాడు. ఇది తండ్రిలక్షణమే! వెంకాయి రోజూ మఱిచిపోకుండా తాగుతాడు. ఇదీ తండ్రిలక్షణమే! కాని సీతాయి మోతాదుప్రకార మైనా ఆ తాగినే సమయంలో యజమానికి ప్రాణం పోయినా కనబడేవాడు కాదు. వెంకాయికి మాత్రం ఆ భయం ఏకోశానా లేదు. పైగా యజమానిఎదుట బడి అడ్డమైనసవాళ్లూ వేస్తాడు. అతని స్వభావం తెలుసును కాబట్టి నారాయణమే సాధ్యమైనంత వరకూ అట్టి సమయాల్లో అతని ఎదుట బడకుండా ఉంటాడు.

వెంకాయికి ఇది ఒక్కటే దుర్గుణమైతే పెద్ద కష్టం లేదు, నారాయణం మంచితనంతో దీన్ని లెక్కచేసేవాడే కాదు. కాని వెంకాయిలో అవ లక్షణాలు ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. దొంగతనం, మోసం, లడాయీల్లో దిగడం ఇత్యా దులు లక్షులు. ఇవన్నీ వెంకాయికి నారాయణందగ్గఱ పనిలో ప్రవేశించేటప్పుడు బీజప్రాయంగానే ఉన్నాయి. నారాయణం వీటినన్నిటినీ గుర్తించి తగిన చికిత్స చేస్తూనేవచ్చాడు. కాని ఆ చికిత్స అతని మీద ఏ మాత్రమూ పనిచెయ్యలేదు. పైగా అతను స్వబుద్ధిచేత వాటి అన్నింటిలో ప్రవీణత సం పాదించాడు.

వెంకాయి కుటుంబాని కంతటికీ నారాయణం తిండికి గింజ లిస్తాడు. కట్టుకునేందుకు బట్టలిస్తాడు. సీతాయిమీది అభిమానంతో, అతను పోయిన కొత్త రోజుల్లో, వాళ్ల పాక పడిపోతే గూడెంలోనే మఱొకచోట నాలుగుకట్టాళ్ల పాకగూడా వేయించి ఇచ్చాడు. తండ్రి చెప్పిన మాటమీది గౌరవంతో తాను ఇంతచేసినా, ఇంత ఆపేక్షతో చూస్తున్నా వెంకాయి తన్ను మోసంచేసి వీలైనప్పుడల్లా ఏదో ఒకటి కాజెయ్యాలని ఎందుకు చూస్తున్నాడో నారా యణానికి అర్థంకాలేదు.

వెంకాయిపెళ్లికి నారాయణం నూరురూపా యలు ఖర్చుపెట్టాడు. తానూ, తన భార్యా తాంబూలం పుచ్చుకోడానికి వీథిలోకి వచ్చినప్పుడు వెంకాయితల్లి కొడుక్కు తన్ను చూపించి "ఆ ధర్మరాజుకాళ్లకు మొక్కు ఆయనదయ సంపాదించుకుంటూ బుద్ధిగా ఉండు వెంకా!" అని ఉపదేశించింది. తల్లి బతికి ఉన్నన్నాళ్లూ వెంకాయి ఆమాటమీద అంతో ఇంతో అదుపాజ్ఞల్లోనే ఉన్నాడు. అటు తల్లిపోవడం ఇటు వెంకాయికి ఉన్నమతి ఊడ్చిపెట్టేసింది. నారా యణం కుటుంబంపెట్టుపోతలకు అంతవఱకు ఋణపడక పోయినా కొత్తగా వచ్చిన వెంకాయిపెళ్లాము తనకు పెళ్లిలో నారాయణం పెట్టించిన చీరతోనే కృతజ్ఞు రాలై భర్తనుండగాలకు అడ్డుపడి బుద్ధి చెపుతూఉండేది. ఎవ రెన్ని చెప్పినా తాగుమోతువెంకాయి 'కుక్క తోక వంకర'సామెత అయాడు.

మొదట్లో వెంకాయి కళ్లంలోగింజలు కా జెయ్యడం మొదలుపెట్టినప్పుడు "పోనీలే! ఎంత కా జేసినా వాడే తింటాడుగదా" అని నారాయణం "ఒరే వెంకా! నీకు కావలసిఉంటే నన్ను అడిగి తీసుకో! నేను ఇవ్వనన్నానా? ఈ దొంగతనం ఎందుకు?"

అని సౌమ్యంగా బుద్ధిచెప్పి ఊరుకున్నాడు. ఒక ఏడాది వెంకాయి తక్కిన పాలేళ్లతో లాలూచీఅయి గడ్డికడియంలో పదిబస్తాలు దాచేశాడు. కడియం ఎట్లా వేశారో కఱ్ఱతో పొడిచిచూస్తున్న నారాయణం ఈసంగతి గమనించాడు. అన్నీ ఒకచోటే పెట్టితే తేలికగా పట్టుబడతామని బస్తాలు నాలుగుమూలలా సర్దారు. నారాయణంకఱ్ఱకు నాలుగైదుచోట్ల గట్టిగా తగిలింది. మొదట్లో గట్టేమో అనుకున్నాడుగాని తూర్పారబోసేటప్పుడు కడియంమీద కూర్చుని ఉండగా బస్తాలే అన్న సంగతి రూఢి అయింది. కాని నారాయణం వెంటనే బయటపడలేదు. సాయంకాలం మూడుగంటలయేటప్పటికి ధాన్యం బస్తాలకెక్కించడం పూర్తి అయింది. అయిన రెండువందలా పదమూడు బస్తాలనూ బళ్లమీది కెక్కించి రెండుమూడు దఫాలలో సందెవేళ అయేటప్పటికి ఇంటికి తోలించేశాడు. చివటిసారి బళ్లతో నారాయణానికి కనబడకుండానే వెంకాయి ఇంటికి వెళ్లిపోయాడు. కళ్లంలో నారాయణానికితోడు కూలిమనిషి ఒకడూ, ఆ ఏడు కొత్తగా జేరిన పాలేరు ఒకడూ మాత్రం మిగిలారు. అప్పటికి పొద్దుగూకింది. అయినా వెన్నెలరాత్రిళ్లు కాబట్టి బాగా వెల్తురు ఉంది. నారాయణం వాళ్లిద్దటినీ పిలిచి తాను కడియం తొక్కుతూ, గట్టిగాతాకిన చోట్లన్నీ పగలదీయించి దొరికినంతవఱకూ బస్తాలు బయటపడేయించాడు. మొత్తం పదిబస్తాలు తేలాయి. అవి తీస్తున్నంతసేపూ ఈ మోసం తమమీద ఎక్కడ పడుతుందో అని వాళ్లిద్దఱూ హడిలిపోయారు. నారాయణం వాళ్లను ఏ మాటా అడగలేదు. వెళ్తూవెళ్తూ "ఇంటికి వెళ్లి బండి పంపిస్తాను. బస్తాలు పంపించండి" అని మాత్రం అన్నాడు. నారాయణం ఇంటికి వెళ్లడంతోటే వెంకాయికోసం చూచాడు. కాని వెంకాయి కనబడలేదు. వెంటనే రెండో పాలేరును బండి తోలుకుని పొలానికి వెళ్లమని పంపించాడు. అందఱూ కలిసి చేసిన మోసం బయటపడిపోయిందిగదా అని వాడు భయపడుతూ బండికట్టుకు బయలుదేరాడు. అప్పటికి రాత్రి ఎనిమిదిగంట లయింది. అంతకు అరగంటకుముందే తాగిన మైకం తగ్గింది వెంకాయికి. వెంటనే పెళ్లాన్ని కసిరి నాలుగు మెతుకులు పెట్టించుకు తినియజమాని ఇంటికి వెళ్లకుండానే పొలందారి పట్టాడు. దారిలో బండి కనబడింది. వెంకాయి తెలివి పాదరసంలాంటిది. సంగతంతా కనిపెట్టేశాడు. ఒసికఱ్ఱలు పట్టుకుని అమాంతం బండిలోకి ఎగిరికూర్చుంటూ "ఓ రెదవన్నర ఎదవా! బండీ తోలుకొస్తుండావురా? చూడు నిన్నేం చేస్తానో!" అని అన్నాడు. ఆ పాలేరు వీడి ధోరణిని చూచి గడగడలాడిపోయి బండి ఆపేశాడు. "ఏం, పగ్గాలు లాగావేం? చేతులు చచ్చడ్డాయా ఏమిటి? ఇంతలో పానం పోదులే! తోలలోయి తోలు" అని కసిరాడు వెంకాయి. బండి పొలం జేరుకుంది. వచ్చిన బండినీ, వెంకాయినీ చూచి పొలంలో ఇద్దఱు మనుష్యులూ కొయ్యబొమ్మలైపోయారు. బండిలో నుంచి అమాంతం బైటికి దూకాడు వెంకాయి. సరాసరి వాళ్లదగ్గఱకు పోతూ "మీబుద్ధి బుడమేట్లో కొట్టుకుపోయిందా ఏంట్రా? అసలు బస్తాలు ఎందుకు తీశారంట బయటికి?" అంటూ డబాయించాడు. "ఆయన పట్టేశాడు. మమ్మల్ని ఏం చెయ్యమంటావు?" అన్నారు వాళ్లు అమాయికంగా. "ఏం చెయ్యమంటానా! ఏడవమంటాను. రండి. ఇట్లా రండి! బస్తాలన్నీ ఊడదీసి గుమ్మరించండి" అన్నాడు. వాళ్లు కదల్లేదు. ఒకసారి వాళ్ళవంక చురచురా చూచి తానే పోయి బస్తాలు ఊడదీశాడు. ఒక్కొక్కటే గుమ్మరిస్తున్నాడు. ఇంకా ఊరుకుంటే ఎక్కడ మీదపడి తంతాడో అని వాళ్ళుగూడా సాయంచేశారు. వెంటనే బస్తాలన్నీ తాలూ, తప్పా, మట్టిబెడ్డలూ-వీటితో నింపేశారు. మూతులు కుట్టి బండీ కెక్కించారు. వెంకాయి బండి తెచ్చిన పాలేర్ని పిలిచి "ఇక తోలుకెళ్లి అప్పజెప్పు" అన్నాడు. "నే నాయనదగ్గఱ ఉద్యోగమన్నా మానుకుంటాను గాని ఇవిమాత్రం తోలుకెళ్ళను" అన్నాడు వాడు. తక్కినవాళ్లిద్దఱూగూడా మేం వెళ్లమంటే మేం వెళ్లమన్నారు. వెంకాయి ఆలోచించాడు. వీళ్లని బెదిరించి పంపించినా అక్కడ నిర్వహించలేక గుట్టుకాస్తా బయటపడవేస్తారు. అందుకని వెంటనే "సరే, నేనే వెళ్తాను. మీరు ముగ్గురూ ఇక్కడే ఉండండి. నేను వచ్చేలోగా ఒక్క గింజ కదిలిందంటే మీ ప్రాణాలు మీవి కావనుకోండి! జాగ్రత్త!" అని

భయపెడుతూ బండితోలుకుని వెళ్లిపోయాడు. బస్తా మూపుమీద వేసుకునివస్తున్న వెంకాయిని చూచి నారాయణం "వాడేడిరా ?" అని అడిగాడు. బరువైన బస్తా దింపుకున్నట్లు ఆయాసపడి "వాణ్ని పొలంలోనే ఉండమన్నాను" అని సమాధానం చెప్పాడు. మళ్లీ నారాయణం ప్రశ్న వెయ్యలేదు. పావుగంటలో పది బస్తాలూ జేరవేశాడు వెంకాయి. బండినీ, ఎడ్లనీ వాటి వాటి స్థానాల్లో పెట్టేశాడు. "పదిబస్తాలూ అప్పజెప్పాను. నేను పొలానికి వెళ్తున్నాను. రాత్రే బళ్లమీద గడ్డితొక్కుతాం" అని యజమానితో చెప్పి వెళ్లిపోయాడు. నారాయణం ఆశ్చర్యపోయాడు. వెంకాయిలో ఈ మార్పుకు కారణం ఏమిటో అతనికి బోధపడలేదు. మోసం బైటపడిపోయిందని మిగిలిన వాళ్లు భయపడ్డారుగాబోలు, అందుకని వీడే తెచ్చి ఉంటాడని సమాధానపఱుచుకున్నాడు. వెంకాయిలో ఈ మార్పును వ్యాఖ్యానించి భార్యకు చెప్పాడు. అప్పుడే పటమటింటిపని ముగించివచ్చిన అన్నపూర్ణ ఇది విని మఱీ ఆశ్చర్యపడింది. ఆమె కెందుకనో నమ్మకం కలగలేదు. ముందున్న బస్తాలు చూపిస్తూ "ఇవేనా వెంకాయి తెచ్చినవి ?" అని అడిగింది. అవుననగానే మూతి విప్పి చూచింది. అంతా తాలూ, తప్పా, బెడ్డలూనూ! నారాయణం అది చూచి దిగ్భ్రాంతి పొందాడు. ఆ రాత్రి అంతా అతని మనస్సు వెంకాయిప్రవర్తననుగూర్చే ఆలోచించింది. వెంకాయిని మాన్పించెయ్యడం ఆలోచన వచ్చినప్పుడల్లా తండ్రిమాట జ్ఞాపకంవచ్చింది. ఒక్కొక్కప్పుడు తన సొమ్ముతీశే అట్లాంటిదేమో అనుకున్నాడు. మఱొకప్పుడు వెంకాయిని విశ్వాసఘాతకుడు అని తిట్టుకున్నాడు. మళ్లీ అయ్యో అని విచారించాడు. వెంకాయిభార్యనూ, బిడ్డనూ తలుచుకుని జాలిపడ్డాడు. తాను ఎంతజేసినా అతడు మాఱక పోవడం తోచి ఆ జాలి సడిలింది. వెంటనే వెంకాయికి స్వస్తి చెప్పాలనుకున్నాడు. మర్నాడుదయం నారాయణం లేచీలేవడంతోటే ఏడుస్తూవచ్చిన వెంకాయిభార్యని చూచాడు. రాత్రి తాగివచ్చి వెంకాయిచేసిన అఘాయిత్యం అంతా ఆమె చెప్పకోగా జాలిగా విన్నాడు. "ఏంచేస్తాంరామీ! ఇదంతా నీఖర్మం నాఖర్మం" అన్నాడు నారాయణం. "అదేంటి బాబయ్యా! అట్టాగంటారు. నాఖర్మం కాలబట్టే ఈడు దాపురించాడు. మారాజులు మీకేం? ఆడిబుద్ది బుగ్గయిపోనూ! ఈబిడ్డని చూసైనా కాస్త కనికారం సూపండి బాబయ్యా" అని ఏడ్చింది. అది అటు అమ్మగారిచ్చిన అప్పచ్చులు పట్టుకువెళ్లగానే ఇటు వెంకాయి పొలంనుండి వచ్చాడు. ఎడ్ల తలతాడులూడదీస్తున్న వెంకాయిని చూచి "ఒరే వెంకా! ఇటురా" అని అన్నాడు నారాయణం. వెంకాయి ఎందుకో ఉలిక్కిపడి అరుగుదగ్గఱకు వచ్చాడు. "నిన్నసాయంత్రం పొలంనుంచి నాకు కనబడకుండా వచ్చేశావేంరా ?" వెంకాయి తల వంచుకున్నాడు. "బాగా తాగావుకదూ ?" వెంకాయి తల ఎత్తలేదు. "నీకు ఇది ఎక్కడ దాపురించిందిరా దరిద్రుడా! తిన్నంత తిని పనిచేసుకోరా బాబూ అని చిలక్కి చెప్పినట్లు చెపుతుంటే వినిపించుకోవు, నీకేం పోయేకాలం వచ్చింది అంటా! పోనీ, తాగినవాడివి తాగినట్లు పడిఉండక ఒళ్లుమత్తెక్కి పెళ్లాన్నీ, బిడ్డనీ చంపుకుతింటావా? చచ్చిస్వర్గాన ఉన్న సీతాయిని తలుచుకుని నీకు ఇంతచేస్తుంటే నే చేసిందంతా విషము అవుతోంది. ఛీ! నీలాంటివాడికి తిండిపెట్టడంగూడా పాపమే! నువ్వు నాదగ్గర పనిచెయ్యక్కరలేదు. ఈ పూట నుంచీ మానేసెయ్యి! పో! నీమొహానికి ఎవడు పని ఇస్తాడో చూస్తాను" ఇలా నారాయణం కేకలు వేసే టప్పటికి అంత దురుసు వెంకాయీ నీరయిపోయాడు. ఉన్నవాడున్నట్లు కూలబడి "మన్నించండి బాబూ! ఈ తప్పకాయండి" అంటూ ఏడ్పు మొదలుపెట్టాడు. "వెధవ దొంగఏడుపులూ నవ్వూనూ! రాత్రి కళ్ళంలో గడ్డికింద దాచిన ధాన్యపుబస్తాలు తీయించి తోలుకు రండిరా అని వాళ్లతో చెప్పి నేను ఇంటికి చక్కా వస్తే నువ్వువెళ్లి గింజలు గుమ్మరించి తాలు మూటకట్టి తోలుకువస్తావా? నిన్నే నటరా నేను రక్షించాల్సింది? ఛీ! నీముఖం చూడగూడదు. లేచిపో అవతలకు!" అని గద్దించాడు నారాయణం. వెంకాయి లేవాలేదు; ఏడుపు తగ్గించనూలేదు. నారాయణం మాత్రం ఇంట్లోకి వెళ్లిపోయాడు. ఒక గంటసేపయాక నారాయణం బైటికివస్తే వెంకాయీ కనిపించలేదు, పాకలో

ఎక్కడా కనిపించలేదు. మరొక గంటసేపటికి వెంకాయి రాత్రి రాత్రే యానాది రంగడికిచ్చిన బస్తాలు వేసుకుని బండితోలుకుని వచ్చాడు. పది ధాన్యపుబస్తాలూ ఇంట్లోకి జేరేశాడు. తాలుబస్తాలు పదీ బండిలో వేశాడు. అరుగుమీద కూర్చున్న నారాయణం దగ్గరకు వచ్చి కూలబడి మళ్లీ గోలపెట్టడం మొదలు పెట్టాడు. "ఈబుద్ధి మొదట్లోనే ఉంటే ఇంత అయ్యేదికాదుగా! ఈమాత్రంభాగ్యానికి దొంగతనం ఎందుకురా వెధవా!" అని కోప్పడ్డాడు నారాయణం. నోట మాట రాక దణ్ణం పెడుతూ కూర్చున్నాడు వెంకాయి. అంతలో వాములదొడ్డిలో బళ్లుదింపి, తక్కిన పాలేళ్లుగూడా వామివెయ్యడంకోసం వెంకాయిని తీసుకుపోవాలని వచ్చారు. నారాయణం వాళ్లను గూడా మొహాలు వాచేటట్లు చీవాట్లు పెట్టాడు. ఒక్కరూ తలెత్తలేక పోయారు. చివరకు నారాయణం వాళ్లందరివంకా చూస్తూ "ఒరేయి వెధవల్లారా! ఏదైనా కావలసి ఉంటే నన్నడగండి గాని ఇదేం బుద్ధిరా పాడుబుద్ధి! మనిషి బదుకంతా నమ్మకంమీద ఉంటుంది. అది చెడిందంటే ఎందుకూ పనికిరారు. ఇప్పటినుంచైనా బుద్ధిగలిగి ఉండండి. మీరు ఆశించిన సొమ్ము నాకక్కరలేదు. మీరు దాచిన పదిబస్తాలూ మీరే తీసుకోండి. ఇప్పుడే పట్టుకుపొండి కావలసివస్తే! నాకభ్యంతరంలేదు. మీరు నమ్మకంగా పనిచేసే పక్షంలో ప్రతియేడూ మీ కిట్లా పదిబస్తాల ఈనామూ ఇస్తాను. ఇక వెళ్లండి. పోయి మీమీపనులు చేసుకోండి!' అని అన్నాడు. దిగులు గుండెలు మిగులుగుండెలుకాగా ఆ నలుగురూ తలలు వంచుకుని తమతమ పనుల్లోకి వెళ్లారు.

నారాయణంయాజమాన్యం అట్లాంటిది. వెంకాయికైంకర్యం ఇట్లాంటిది. దీనికి ఎవరు ఏం చెయ్యగలరు?

అప్పటినుంచీ నాలుగేళ్లవరకూ వెంకాయి మర్యాదగానే ఉంటూవచ్చాడు. కాని ఇటీవలనే మళ్లీ యథాప్రకార సిద్ధిరస్తు అయ్యాడు. దీనికి అసలుగుణం మినహాగా కారణాలుగా చెప్పుకోబడేవి అనేకం ఉన్నాయి.

## 3

లక్ష్మన్న చనిపోయిననాడు నారాయణానికి వెంకాయి కనిపించకపోవడానికిగూడా ఇటువంటి దుష్టబుద్ధే కారణం. అంతకు క్రితంరోజునే ధాన్యం అంతా ఇంటికి జేరవెయ్యడం అయిపోయింది. ఈ నాలుగేళ్లబట్టీ బుద్ధిగానే ఉన్నాడుగదా అని బాధ్యత అంతా వెంకాయిమీదే పెట్టి, ఎందుకైనా మంచిదని రాఘవయ్యను కాస్త చూడమని చెప్పి, తప్పకవచ్చిన పనిమీద పొరుగూరువెళ్లి నారాయణం ఆరాత్రే వచ్చాడు. రాత్రి పూర్తిగా గడిచిందో లేదో లక్ష్మన్న అకస్మాత్తుగా చనిపోవడం జరిగింది.

ఉదయాన్నే లక్ష్మన్న మృతివార్త విన్న వెంకాయి పొలంకాపలా మినహపెట్టి అక్కడే కూర్చున్నాడు. ఈసారి అతను తక్కిన పాలేళ్లను తనతో కలుపుకోలేదు. దాచిందిగూడా అట్టే ఎక్కువలేదు. ఒక్క అయిదుబస్తాలుమాత్రమే! ఈసారి ఈపని చెయ్యడానికి అతనికి పాపం పెద్ద అవసరమే వచ్చింది.

అసలు వెంకాయి గూడెంలోకల్లా ఎఱ్ఱటివాడైన కారణంచేత కొంచెం అందమైన మనిషి. సహజంగా మంచి భారీవిగ్రహం. కష్టపడి పనిచేసేవాడు కాబట్టి కండలుతిరిగిన శరీరం. కొంచెం షోకిల్లా పురుషుడైన కారణంచేత పెంచి మెలితిప్పిన మీసాలు. వీనితోనే అతను గూడెంలోకల్లా రసికశ్రేష్ఠుడని పించుకున్నాడు. వీనికితోడు విశేషంగా మద్యపానం కల్పించిన నేత్రాంతాల్లోని రక్తిమ అతని రాసిక్యాన్ని ఇనుమడింపజేసింది. అతడు తన రసికతను స్వకాంతకు వెలిగా ప్రదర్శించడానికి ఈ ఏడే-గూడెం అంతా కోతల్లోకి దిగిన కొత్తరోజుల్లో-అవకాశం లభించింది. అప్పుడు ఆ ఊరి కొక యానాదివేషగాళ్ల ముఠా వచ్చింది. అప్పుడప్పుడే నాలుగుడబ్బులు చేతుల్లో పడుతూఉన్నందువల్ల గూడెంవాళ్లందరూ కలిసి ఒకనాటకం వేయించారు. అది పారిజాతాపహరణం. ఆ నాటకంలో ఒక కులంచెడ్డ స్త్రీ సత్యభామపాత్ర ధరించింది. ఆమె సామాజికుల్లో నారాయణం ఇచ్చిన తెల్ల దుస్తులలో మిలమిలా మెరుస్తున్న ఇతనివంక చూచి

కనుసంజ్ఞలు చెయ్యనారంభించింది. వెంకాయి పూలరంగడయి ఓరచూపులు చూస్తూ మీసం పైకి దువ్వాడు. అంతే! ఆ స్త్రీ ఆ ముఠాను వదలిపెట్టి రహస్యంగా ఊరిబయట వెంకాయి నాశ్రయించింది. ఆమెకోసం వెంకాయి తన ఊరుకు పక్కనున్న ఊళ్లో ఒక చిన్న గుడిసె వేసిఇచ్చాడు. తన ఇంట్లో గింజలు పెళ్లాంతో పోట్లాడి ఒక బస్తా లాక్కుని తీసుకునిపోయి దాని ఇంట్లో పడేశాడు. నారాయణం ఇచ్చే పై ఖర్చు సొమ్ము తన ఖులాసాలు సాగించుకోవడానికి రామి ఏ మాత్రమూ ఇవ్వదు. దానిదగ్గఱ తాగుడుకు లాగే టప్పటికే యమయాతన అవుతోంది. ఇక దీనికిగూడా ఎక్కడ ఏడవగలడు? అందుకోసం ఈ దొంగతనం చెయ్యవలసివచ్చింది. ఇది పైకి కనబడే కారణాల్లో ముఖ్యమైనది. కాని నిజానికి వెంకాయి తలుచుకుంటే పాలేరుతనంలో ఉండీకూడా పై పనులు చేసి వెధవ అయిదుబస్తాలు అవసరమయితే సంపాదించలేకపోడు. అయితే ఏం? వాడి బుద్ధి అట్లాంటిది.

లక్ష్మన్న చనిపోయిననాడు పాలేళ్లు ఊళ్లోకి వెళ్లిన సమయం చూచుకుని, బలేవీలు దొరికిందిగదా అని గొడ్లకాపరిబుడ్డాళ్లను బెదిరించి గడ్డికడియం చూస్తూ ఉండండని ఆ అయిదు బస్తాలూ బండిమీద వేసుకుని దానిఇంటికి చక్కా పోయాడు వెంకాయి. లక్ష్మన్నమరణం ఇటు యజమాని కెంత దుఃఖం కలిగించిందో అటు పాలేరు కంతసంతోషం కలిగించింది. లోకంలో ఎవరి సుఖదుఃఖాలైనా ఇంచుమించు ఇంతేనేమో!

లక్ష్మన్నమరణంతో ఆర్ద్రహృదయుడైన నారాయణం వెంకాయి కనిపించకపోవడాన్ని గమనించనేలేదు. ఆమర్నాడు ఉదయం దైన్యభావం ముఖంలో సూచిస్తూ వెంకాయి కనబడేటప్పటికి నిద్రతో కొద్దిగా వెనకబట్టిన నారాయణందుఃఖం మఱొకమాఱు పోటుపొడిచింది.

వచ్చిన కన్నీళ్లను తుడుచుకుంటూ - "ఏరా వెంకా! రామన్నను చూశావురా, ఎట్లా ఉన్నదో?"

"చూడకేం బాబయ్యా! మేతమెయ్యడంలేదు." అన్నాడు వెంకాయి.

"అవునురా! మేత ఎట్లా మేస్తుంది? నాకే ఇంతదుఃఖంగా ఉంటే దానికడుపులో ఎంతదుఃఖం ఉందో పాపం!"

"చిత్తం బాబయ్యా! నోరులేని గొడ్డు; అదేం చెప్పకోగలదు?"

"అదేమాటరా వెంకా! మనకు తెలియదుగాని పశువు నిజంగా ఆరూపంలో ఉన్న దేవతరా! నిన్న ఉదయం లక్ష్మన్నను తీసుకుపోయి వాముల దొడ్డిలో పాతిపెట్టేటప్పుడు రామన్న ఏడ్చిన ఏడ్పు ఇంతా అంతా కాదుగదా! చివటికి పూడ్చిపెట్టాక అంతా వెళ్లిపోయారు. రాఘవయ్యా, నేనూ, రామన్నా మిగిలాము. రాఘవయ్యబలవంతంమీద నేనూ బయలుదేరాను. రామన్నను ఇంటికి తోలుకువద్దామని ఎంతో ప్రయత్నంచేశాము. అది కదలనే లేదు. చివటికి రాఘవయ్య వాములో గడ్డిదీసి దాని ముందు పడేశాడు. నువ్వు నమ్ముతావో నమ్మవోగాని అది వాసనైనా చూడలేదు సుమా! ఏం చెయ్యడానికీ తోచక దాన్ని అక్కడే ఉంచి ఇంటికి వచ్చేశాం. ఇంత కంటే ఎక్కువ ఏం చెప్పాలి వెంకా? వాటిబుద్ధిముందు నిజంగా మనం పశువులం అనిపిస్తుంది. ఏమంటావ్?"

వెంకాయి కీమాటలు మనసులో శూలాల్లా గుచ్చుకున్నాయి. నారాయణం తన దుఃఖం ఒలకబోసుకున్నాడేగాని ఈమాటలు అనాలని అనలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లున్న వెంకాయిని చూచి నారాయణం "ఏమిటిరా ఆలోచన!" అన్నాడు.

"ఏంలేదు బాబయ్యా! వాటి బుద్ధిమాటే అనుకుంటున్నాను. మా దొడ్డబుద్ధండి వాటిది!"

"సరేగాని వెంకా! లక్ష్మన్నకూ, మనకూ ఋణం తీరిపోయింది. ఇక రామన్నైనా మనకు... ..." అని సగంలో ఆగిపోయాడు నారాయణం.

"అట్లా అనుకోగూడదు బాబయ్యా! రామన్న కొత్తలో ఇట్లా ఉన్నా నాలుగునెలల్లో మళ్లీ మామూలుగా అయిపోతుంది. ఈలోగా మనం దానికి దీటైన ఎద్దు సంపాదించి జతగూర్చామంటే మఱీ తొరగా పరిసిపోతుంది విచారం" అన్నాడు వెంకాయి,

నారాయణానికి ఈమాట అంతగా నచ్చలేదు.

"నువ్వు అన్నమాట నిజమేకావచ్చును గాని వెంకా! రామన్నకు సమానమైన ఎద్దు దొరుకుతుందంటావా ఎక్కడైనా?"

"దొరకక్కేం బాబయ్యా! మనం డబ్బుపుచ్చుకు తిరగాలిగాని మాచక్కగా దొరుకుతుంది. రాండి పోదాం ఇయ్యాల. ఎల్లుం డీపాటికి మళ్లీ లచ్మన్నను పట్టుకొచ్చామన్నమాటే!"

వెంకాయి ఈమాటలు అంటూంటే అన్నపూర్ణ గుమ్మంలోకి వచ్చి "నిన్ననల్లా కనబడనేలేదేమిరా వెంకా!" అని అన్నది.

"గడ్డిచూసుకుంటా పొలంకాడే పడిఉండానమ్మా! ఇక్కడేమో ఇట్లా జరిగింది. రాలేకపోయాను" అంటూ ఎక్కడలేని విచారమూ వెలిబుచ్చాడు వెంకాయి.

బాష్పరుద్ధమైన కంఠంతో "ఒరే వెంకా! నువ్వు పోయి పనులన్నీ త్వరగా కానీ. నాలుగు రోజుల్లో మనం బయలుదేరదాం" అన్నాడు నారాయణం.

"చిత్తం బాబయ్యా!" అంటూ వెంకాయి సెలవు పుచ్చుకున్నాడు.

## ౪

ఆ మూడురోజులూ వెంకాయి రాత్రిళ్లు పొరుగూరూ, పగళ్లు పొలమూగా విహరించాడు. యజమాని ఇంటిముఖమూ చూడలేదు, తన ఇంటిముఖమూ చూడలేదు. దీన్ని చేరదీసిన మర్నాడే "బాబుగోరి ఇంటికి వెళ్లావంటే నెత్తురు కళ్లచూశానన్నమాటే" అని పెళ్లాన్ని మంచితెలివిలోనే బెదిరించిపారేశాడు. ఆ అమాయికపు రామి హడిలిపోయి అప్పటినుంచీ గుడిసె ఇవతలకు అడుగువెయ్యడమేలేదు. వెంకాయికి తన దిలాసా ఏమో తనేమో! రామిగోడు అతనికి అవసరమే లేకపోయింది.

రోజూ సాయంత్రం కాగానే మామూలుకంటె ఎక్కువగా తాగేవాడు. సరాసరి కాళ్లు ఈడ్చుకుంటూ దాని ఇంటికి చేరుకునేవాడు. ఈ మూడో రోజు సాయంత్రం ఇంకోలోటా ఎక్కువ తాగి దాని ఇంటికి చేరుకున్నాడు. ఆ పరవశత్వంలో ఆనాడు వెంకాయి ఒక్క కల్లుకే కాకుండా దానికిగూడా దాసుడై పోయాడు. ఆ ఆటకత్తె ఎట్లా ఆడిస్తే అట్లా ఆడుతున్నాడు. ఆరాత్రి ఆసుందరి అతనిపక్కన జేరి 'వెంకా' అని పిలిచింది. ఆ పిలుపులో వెంకాయి అమృతమే తాగాడు. తన ప్రియురాలి కళ్ళల్లోకి చూచాడు. గట్టిగా చేతులు చుట్టేశాడు. ఆ బిగువు సడలించుకుంటూ ఆసుందరి "నువ్వు ఎప్పుడూ ఇంతే! దీనికేంగాని మనం ఎప్పుడూ ఈపాకలోనేనా ఉండడం?" అని గునుస్తూ అన్నది. వెంకాయి తాగిన ఉద్రేకంలో ఉన్నాడు. "ఛీ! ఈపాకేమిటి? నువ్వు నా రాణివి. చూడు, రెండేళ్లలో నిన్ను మేడలో కూర్చోబెడ్తాను. ఈపనే చెయ్యలేకపోతే నాపేరు వెంకాయికాదు"అంటూ మీసం మెలివేశాడు. వెంకాయిని గట్టిగా కుదిపి మైకం వదలిస్తూ "నిజమేనా? తాగిన మైకంలో అంటున్నావా?"అని కొంచెం ఎడంగా తోసింది ఆ అమ్మాయి. "ఏమన్నావు? నేను తాగానా? అవునవును. ఎప్పుడో తాగాను. ఆ మజా అయిపోయింది. ఓసి నాగువ్వా! నిన్ను నిజంగానే నారాణిని చేసేసుకుంటాను"అన్నాడు వెంకాయి. ఈమాట లన్నప్పుడు వెంకాయికి నిజంగానే తెలివి ఉంది. దీన్ని అంతదాన్నీ చెయ్యాలనీ, తాను రాజభోగం అనుభవించాలనీ అతని హృదయంలో గాఢమైన అభిలాషే ఉంది. అటువంటి కలలే కంటూ ఇరువురూ గూడా ఆరాత్రి హాయిగా నిదురించారు.

మర్నాడు ఉదయమే వెంకాయి పొలంలోకి వెళ్లి ఇదివఱకు పాలేళ్లు చెయ్యగా మిగిలిన కురదలా పనులన్నీ ఆపూటే ముగించివేసి నారాయణందర్శనం చేశాడు. ఈ మూడురోజులూ నారాయణం ఒక్క రామన్నను చూడడానికి వెళ్లివస్తూఉండడంతప్ప ఇంట్లోనుంచి బైటికి కదలనేలేదు. ఏపూట ఎంతవఱకైందీ చిన్నపాలేళ్లు వచ్చి చెపుతూవచ్చారు, అతను ఊకొడుతూ వచ్చాడు. అంతే! ఈ వేళ వెంకాయి కనబడీకనబడడంతోటే "ఏరా వెంకా! ఇంకా ఎప్పు

డురా బయలుదేరడం? ఎంతవరకూ అయ్యాయి పనులు?" అన్నాడు నారాయణం.

"పని అంతా పూర్తి అయితేగాని మీకు కనబడగూడదనుకున్నాను. పూర్తిచేసేశాను. ఇక మీరు ఎప్పుడంటే అప్పుడే" అన్నాడు వెంకాయి.

"అయితే రేపు ఉదయమే బయలుదేరదాం. మీ ఇంటికాడ గింజలూ గట్రా ఉన్నాయో లేదో కనుక్కొని, అవసరమయితే రెండుబస్తాలు పడేయించు. అవి అయేలోపల రాగలంగదా! తర్వాత చూచుకుందాం" అన్నాడు నారాయణం.

"చిత్తం బాబయ్యా!" అని వెంకాయి సెలవు తీసుకున్నాడు.

ఆ రోజునే తన ఇల్లూ, వాములదొడ్డీ, గొడ్డూ గోదా కాస్త చూస్తూఉండమని రాఘవయ్యకు అప్పజెప్పాడు నారాయణం. తాను వచ్చేవరకూ అవసరమయితే రామిని మనఇంటిదగ్గరే పడుకోమని చెప్పమని భార్యతో చెప్పాడు.

"గొడ్లు చాలా గిరాకీగా ఉన్న రోజులుగదా! ఎటుపోయి ఎటు రావలసివస్తుందో తెలియదాయె! రామన్నకు దీటైన ఎద్దు ఎక్కడైనా కనబడ్డా దాని ఆసామీ అమ్మతానంటాడో అమ్మనంటాడో! కొంచెం ఎక్కువగానే ఆశపెట్టాలి!" అని ఆలోచించుకుని రెండువేలు ఎద్దుకనీ, ఒకవెయ్యి ఖర్చుకనీ మొత్తం మూడువేలు మూటకట్టాడు. కొత్త ఎద్దుకూ, రామన్నకూ స్నేహం కుదురుతుందో కుదరదో, తీరా తెచ్చాక ఇబ్బందిపడవలసి వస్తుందేమో, ఎందుకైనా మంచిదని రామన్ననుగూడా వెంట తోలుకువెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

రామన్న ఈ మూడురోజులూ వాములదొడ్లోనే ఉన్నది. మొదటిరోజు గడ్డి ముట్టలేదు గాని రెండోరోజునుంచీ వామిమీద పడి కొద్దికొద్దిగా మేస్తూనే ఉన్నది. అక్కడే ఒకతొట్టి వేయించి నారాయణం నీళ్లు పోయిస్తూవచ్చాడు. ఆ నీళ్లు తాగి ఆ గడ్డి తిని రామన్న అక్కడే పడిఉన్నది. ఆరోజు సాయంత్రం నారాయణం రేపే ప్రయాణంగదా అని రామన్నను ఇంటికి తోలుకువద్దామనుకున్నాడు. సరాసరి వాములదొడ్డికి వెళ్లేటప్పటికి లక్ష్మన్నను పాతిన చోటుకు దగ్గర్లో పడుకుని నెమరువేస్తోంది రామన్న. నారాయణం తలుపుతెరిచి లోపలికి వచ్చేటప్పటికి రామన్న లేచి నుంచుంది. అతను మెల్లగా దానిదగ్గరకు వెళ్లి వెనక జబ్బలమీద చేత్తో తట్టాడు. ఆ తట్టడంలో ఏం భావం ఉందో ఏమో రామన్న పెండెంవైపు నాలుగు అడుగులు వేసింది. నారాయణం ఆనందతన్మయుడై నిలబడ్డాడు. పెండెందాకా వెళ్ళిన రామన్న ఎందుకో చటుక్కున ఆగి ఒక పెద్దఅంకె వేసింది. అకస్మాత్తుగా వెనక్కుతిరిగి వేగంగా లక్ష్మన్నను పాతిన చోటుదగ్గరకు వచ్చి ఆ స్థలం అంతా మూచూచింది. నారాయణం ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ దాని అబ్బు గోకాడు. అబ్బు గోకించుకుంటూనే నాలుగయిదుమాట్లు అంభా అంభా అని అరిచింది రామన్న. నారాయణం దుఃఖభారం సహించలేకపోయాడు. ఒకచేత్తో గుండెనూ, ఒకచేత్తో తలనూ పట్టుకుని పెండెంవైపుకు నడిచాడు. అతని వెంబడే రామన్న బయలుదేరింది. నారాయణం గమనించనేలేదు. రోడ్డు ఎక్కాక రామన్న మళ్ళీ అరిచింది. ముఖంలోకి పొంగి వస్తున్న దుఃఖంతో నారాయణం వెనుదిరిగిచూచాడు. రామన్న తన వెంబడి వస్తోంది. ఆపేక్షతో దాని అబ్బు గోకాడు. మళ్లీ వెనకతట్టు మెల్లగా తట్టాడు. రామన్న సరాసరి ఇంటిదారి పట్టింది. నారాయణం దాని వెంబడే ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రి దీపం పెట్టుకుని నారాయణం రామన్నను అలంకరించాడు. పదిమాట్లైనా లేచి మేత చూచాడు. దాని నిద్రలో తన నిద్ర, దాని తిండిలో తన తిండి, దాని క్షేమంలో తన క్షేమం చూచుకుని తృప్తిపొందాడు.

వాములదొడ్డిపెండెం తీసివచ్చిన సంగతి తెల్లవారుజామున వేసివచ్చిన వెంకాయి చెపితేగాని నారాయణానికి తెలియలేదు.

వెంకాయి వచ్చినతక్షణమే అతన్ని వెంటబెట్టుకుని, ముందు రామన్నను తోలుకుంటూ, లక్ష్మన్నన్వేషించడం కోసం బయలుదేరాడు నారాయణం.

౬

అదిమొదలు తన ఊరుకు చుట్టుప్రక్కల ఏభై మైళ్లదూరంలో నారాయణం తిరగని ఊరు లేదు. ఆహద్దులో ప్రతిపల్లెనూ, ప్రతిగ్రామాన్నీ గాలించి విడిచిపెట్టాడు. రామన్ననూ లక్ష్మన్ననూ చూచిన కళ్లతో ఆయాఊళ్లల్లో ఎడ్లను చూస్తే వాటినీ వీటినీ ఒకేజాతిగా ఎంచడం తప్పు అనిపించింది. ఈరెంటినీ తనకు పరమశివుడు కేవలం వరప్రసాదంగా ఇచ్చాడన్న నమ్మకం దృఢపడింది. అటువంటివాటిలో లక్ష్మన్నను కోల్పోయిన తనకు దానికి దీటైనది ఇంకోటి దొరుకుతుందనే ఆశ పెట్టుకోవడం వట్టి ప్రయాస అనిపించింది.

రామన్నను చూచిన ప్రతివాళ్లూ ముక్కుమీద వేలు వేసుకుని ఆశ్చర్యపడేవాళ్లే! ప్రతివాళ్లూ అటువంటిది మనకుంటే ఎంత బాగుండునని ఆశపడేవాళ్లే! కాని వెంటనే వాళ్లంతట వాళ్లే అటువంటిది ఇంకోటి మనదగ్గఱ లేదుగదా, మఱి ఎక్కడైనా సంపాదించినా మనం ఎక్కడ నిభాయించగలం వీటిని అని నిరాశపడుతూ నేవచ్చారు. కొందఱుకొందఱు మోజుపడి ఒంటరిదైనా సరే అటువంటిది మనదగ్గఱ ఉంటేనే చాలునని దాన్ని కొనాలని నారాయణాన్ని అడిగి అతని కోరిక తెలుసుకుని దిగులుపడి వెనక్కు తగ్గారు.

ఈ ప్రయాణంలో రెండోఊరు దాటినదగ్గఱనుంచీ నారాయణానికి ఒక విషయంలో అమిత భయం ఏర్పడింది. అది ప్రతివాడికన్నూ రామన్నమీదే పడుతూ ఉండడం. ఆభయంతో అతడు ప్రతి వూళ్లోనూ దేవతలకు కొబ్బరికాయలు కొట్టి దిష్టితాళ్లు వేయిస్తూ నేవచ్చాడు. ఇంతదాకా వచ్చేటప్పటికి వెంట్రుకలతాళ్లు రామన్న నాలుగుకాళ్లనూ నింపేశాయ్. అప్పటినుంచీ చూచేవాళ్ల చూపులన్నీ ఆ వెంట్రుకలతాళ్లమీదే పడుతున్నాయి. ఇక భయం లేదనుకున్నాడు నారాయణం. కాని అటువంటి ఎద్దును కలిగివున్న తనమీద జనుల చూపులు పడుతూ వుండడం అతను గమనించనేలేదు.

చిట్టచివఱకు ఇబ్రహింపట్టణానికి వచ్చినాకూడా తనకు కావలసిన ఎద్దు దొరక్కపోయేటప్పటికి నారాయణానికి పూర్తిగా నిరాశే అయిపోయింది. "ఇక పోదాం పదరా వెంకాయి" అన్నాడు నారాయణం. వెంకాయి కింకా ఆశపోలేదు. మన ప్రయత్నం ఫలించేదాకా మొదలుపెట్టిన పని మాని వెయ్యగూడదని బాగా నచ్చజెప్పాడు. ఇంతవఱకూ నారాయణం చూడగలగడానికైనా వెంకాయి ప్రోద్బలమే ముఖ్యకారణం.

మళ్లీ నడక సాగించారు. ఊళ్లు చూస్తున్నారు. ఎక్కడా దొరకడం లేదు. ఒక్కొక్క వూరే విడిచిపెట్టి సాగిపోతున్నారు.

అట్లా వెళ్లివెళ్లి చిట్టచివఱకు నందిగామ సమీపించారు. అది గోధూళిసమయం. అప్పుడే పొలాల నుండి గొడ్లన్నీ ఇళ్లకు మళ్లుతున్నాయి. అప్పటికి సంక్రాంతిపండగ వెళ్లింది కాబట్టి ఆ మెట్ట వూళ్లల్లో ఇంచుమించు పొలంపనులన్నీ అయిపోతాయి. అందుచేత అవి పశువులన్నీ విశ్రాంతి ననుభవించే రోజులు. కోసిన జొన్నచేలల్లో ఇగురుపట్టిన చొప్పా, బీళ్లల్లో మంచుకు నేవళంగా పెరుగుతున్న గడ్డీ కడుపులనిండా మేసి కాలికొద్దీ యథేచ్ఛగా తిరిగి పశువులు తున్నివారణతోపాటు విశ్రాంతి సుఖాన్ననుభవిస్తున్నాయి. మౌనరూపాన విజయగానం చేస్తూ క్రమశిక్షణలో తీర్చి నడిచే శాంతి సమరసైనికులవలె బారులుగట్టి వెళ్తున్న ఆ గోలో కొన్ని చూచి నారాయణంమనస్సు కుదుటబడింది. అతనికి తన ఆశ ఫలోన్ముఖమైన ట్లనిపించింది. వెంకాయి తన పట్టు నెగ్గినట్లే పరవళ్లుతొక్కాడు.

ఆరాత్రి వాళ్లు ముగ్గురూ వూరిబయట చెట్టుకిందే మకాం వేశారు. నారాయణమూ, వెంకాయీ ఏదో ఇంత తిని గొంగళ్లు ముసుగుపెట్టి పడుకున్నారు. రామన్నమాత్రం పక్కవూరునుంచి వెంకాయి మోసి తెచ్చిన గడ్డిమోపులో సగం పక్కపఱుచుకుని తక్కిన సగంలో సగం తిని మ్రాగన్నువెట్టి జాత్యంశతో నిద్రాపోయింది; నామాంశతో పాలకభారమూ వహించింది.

మర్నాటివుదయం నారాయణం ఆ చెట్టుకిందే రామన్నను పెట్టుకుని ఉండిపోయాడు. గొడ్లన్నీ

ఇస్తే వస్తాయిగదా, పరీక్షగాచూచి వాటిల్లో కంటికి నచ్చింది ఏదైనా వుంటే ఆలోచిద్దామని అతని వుద్దేశం. వెంకాయిమాత్రం లేచీలేవడంతోటే యజమానితో చెప్పి వూరివెంబడి పడ్డాడు. ఇళ్లల్లో వాకబు చేసి, అమ్మతామన్న ఎడ్ల నన్నిటినీ చూచాడు. మిగిలిన వూళ్లలో వున్నంత నాసిగా లేవు ఇక్కడివి. దూరాన్నుంచి చూస్తే రామన్నతో సమానంగానే కనిపిస్తాయి. దగ్గఱకుబోయి పరీక్షగా చూడగా కొమ్మలు బాగుండకపోవడమో, బక్కటోకఉండడమో, 'తప్పుడు సుళ్లువుండడమో ఏదోఒక లోపం కనిపిస్తూనేవచ్చింది. ఇల్లాంటి లోపాలేవీ లేవుగదా అని కొన్నిటిని చూస్తే ముఖంలో బొత్తిగా కళ లేకపోవడం తటస్థించింది. కొన్నింటివి వట్టి ఆవుముఖా లయిపోయాయి. వెంకాయికేం చెయ్యడానికీ తోచలేదు. విసుగుపుట్టి దిగులుపడ్డ గుండెతో మకాంచెట్టు చేరుకున్నాడు.

అప్పటికి నారాయణం చితుకులు పోగేసి తాబేటికాయలో నీళ్లతోనే కూడు ఉడకవేశాడు. వచ్చిన వెంకాయిముఖం చూచి సంగతంతా గ్రహించాడు. "సరేరా! గిన్నె తీసుకో! కూడు తిందుగాని. తర్వాత ఏమైతే అదే అవుతుంది"అన్నాడు. గోగాకు పచ్చడి వేడిఅన్నంలో కలుపుతూ వెంకాయి తాను చూచిన వివరమంతా సగం ఆశ్చర్యంతో, సగం దిగులుతో చెప్పుకున్నాడు యజమానికి. నారాయణం అతను చెప్పేది వింటూ, మధ్య మధ్య దిగాలుపడి చూస్తూ తన భోజనం తాను కానిచ్చాడు.

అప్పుడు పదిగంటలవేళ అయింది. రోడ్డువెంబడి పశువులు అప్పుడప్పుడే మందలుమందలుగా బయలుదేరి వస్తున్నాయి. వస్తున్న పశువుల్ని చూచి రామన్న లేచి నిలబడి మేతమేస్తూ అప్పుడప్పుడు అరుస్తోంది. నారాయణం అప్పుడే లేచి రెండోతాబేటికాయ నీళ్లతో చెయ్యి కడుక్కుని. రోడ్డుపక్కనే నిలబడి కంటికి నచ్చినట్లు కనబడ్డ ప్రతియెద్దునూ చూచాడు. గంటసేపు అట్లా గొడ్లు వస్తూనేఉన్నాయి. నారాయణం వాటివెంబడి తిరిగి చూస్తూనేఉన్నాడు. మఱీ నచ్చినట్లు కనబడ్డ ఒకొక్కక్క ఎద్దును చూస్తూ ఒకొక్క ఫర్లాంగు నడిచాడు. అందాకా పోయాక బాగు లేదనుకోవడం, వెనక్కు నాలుగుఅడుగులు వెయ్యడం, అంతలో మఱొకటి ఏదో నచ్చినట్లనిపించడం, మళ్లీ దానివెంబడి పోవడం, వెనక్కుతిరగడం - ఇట్లా మకాంచెట్టునుండి మైలుదూరం తనకు తెలియకుండానే నడిచాడు. ఇక గొడ్లురావడం లేదు. చేతులు కట్టుకుని, తలవంచుకుని, మెల్లిగా అడుగు దీసి అడుగు వేస్తూ వెనక్కివచ్చేశాడు. అంతా వెంకాయి చెప్పినట్లే అయింది.

చెట్టుకిందికి వచ్చి రామన్నపక్క నుంచున్నాడు. రామన్న సంతోషంతో తల ఆడించి మువ్వల పట్టెడ మోగించింది. అతని చెయ్యి రామన్న అఱ్ఱుగోకింది. చూపుఎదురుగా చింత చెట్టుమాను చూస్తోంది. మనసు ఎక్కడున్నదో, ఏలోకాల్లోకి పోయిందో!

కాసేపుండి వెంకాయి యజమానిదగ్గఱ పైకం తీసుకుని ఎద్దుమేతకోసమూ, చుట్టపొగాకుకోసమూ ఊళ్లోకి వెళ్లాడు. అప్పటికి పదకొండు దాటిందేమో! నారాయణం అట్లాగే రామన్నపక్కనే నిలబడినిలబడి ఎదురుగా చూచిచూచి దాని నడుముమీదే కళ్లుమూసుకుని తల వాల్చాడు.

పదినిమిషాలు అతినిశ్శబ్దంగా గడిచింది.

అంతలో రామన్న 'అంభా' అని అరిచింది. వెంటనే మఱొక అంభారవం వినపడింది.

నారాయణం ఉలిక్కిపడి తల ఎత్తాడు. రామన్నచేత అఱ్ఱు నాకించుకుంటూ దానిముందున్న గడ్డిపరకలు నములుతున్న ఎద్దును చూచి తానున్న దెక్కడో నమ్మలేకపోయాడు. కంగారుపడి కళ్లుతుడుచుకుని చూచాడు. ఇతని కంగారు చూచి వాటి కెదురుగా చేతికఱ్ఱతో, బుట్టతలపాగతో త్రిభంగిగా నిలబడిఉన్న గొల్లకుఱ్ఱవాడు భయపడి తన ఎద్దును అదిలించాడు. ఆఎద్దు అరుస్తూ ముందడుగు వేసింది. రామన్న తల త్రాడు లాక్కుంటూ అరిచింది. నారాయణం "ఉండు అబ్బాయి"అంటూ వెంటబడ్డాడు. నడుస్తున్న ఎద్దును వీపుమీద తట్టి ఆపాడు. అఱ్ఱుగోకుతూ కాసేపు నిలబెట్టాడు. ముఖంచూచాడు, ముక్కుచూచాడు. మూపురం చూచాడు, ముందుభాగం చూచాడు. తోక

చూచాడు, తోకకుచ్చు చూచాడు. వటుం చూచాడు, నాణ్యం చూచాడు. రంగు చూచాడు, శృంగారం చూచాడు. రెండు చేతులతోనూ ఒకమాటు ఒళ్లంతా తడివి చూచాడు. అంతా తన లక్ష్మన్నే! దోరదానికి లక్ష్మన్న అనీ, కత్తిదానికి రామన్న అనీ తనే పేర్లు పెట్టుకున్నాడు. ఆనందం పట్టలేక నారాయణం ఎగిరి గంతువెయ్యడం మొదలుపెట్టాడు. ఆ గొల్లబ్బాయి "మాఎడ్లు పోతున్నాయిసామీ! దీన్ని విడిచిపెట్టు!" అంటూ నారాయణందృష్టి నాకర్షించాడు. నారాయణం తన చొక్కా జేబులోంచి పది రూపాయల నోటు తీసి వాడి చేతికిచ్చి "నువ్వు చాలా మంచి వాడివి. దీన్ని తీసుకో! నన్నూ, నారామన్ననూ బతికించావు"అంటూ అధికానందోన్మాదపరవశు డై పోయాడు. ఆనోటు చేత్తో పుచ్చుకునే "నాకెందు కయ్యా ఇదీ! నన్ను పోనియ్యి!"అన్నాడు గొల్లాడు. "ఎందుకేమిటిరా అబ్బీ! లక్ష్మన్న పేరు చెప్పి గుడ్డలు కుట్టించుకో!"అని ఎద్దువంక చెయ్యిచూపిస్తూఅన్నాడు నారాయణం. గొల్లవాడు ఉలిక్కిపడ్డట్లయి "దీనిపేరు లక్ష్మన్న అని నీ కెట్లా తెలుసు?" అన్నాడు. నారాయణం ఒకనిమిషం స్తబ్ధుడైపోయాడు. అంతలో తెలివితెచ్చుకుని "అవునులే! ఇది మాలక్ష్మన్నే! నాకు తెలుసు"అన్నాడు. ఇతని మాటలు విని నవ్వుతూ గొల్లవాడు ఎద్దును అదిలించాడు. నారాయణం నడుస్తున్న దానివంకే చూస్తున్నాడు. అతన్ని పిచ్చివా డనుకున్నాడో ఏమో కొంతదూరం పోయాక వెనక్కి తిరిగి ఆ గొల్లవాడు "ఏమయ్యోయ్! మాపటేళ చెట్టుకాడే ఉంటావా? ఆఇల్లే మాఅయ్యగోరిది. సందేళ తోలుకొస్తాలే"అని పదిరూపాయల కాగితం చేత్తో చూపిస్తూ అన్నాడు. ఎద్దువంక చూచిచూచి నారాయణం చెట్టుకిందికి వచ్చాడు.

ఈ ప్రయాణంలో మ్లానమైన నారాయణం ముఖం ఇప్పటికి శశాంక బింబ మయింది. కాని అతని మనసులో ఒక ఆందోళన బయలు దేరింది. "ఈ ఆసామి ఎద్దును అమ్ముతాడో అమ్మడో! ఈయనగూడా ఎద్దును లక్ష్మన్న అని పిలుస్తాడుట! పశువుల్ని పేరుపెట్టి పిలుస్తాడంటే ఎంతో ప్రేమతో పెంచేవాడన్నమాట. బహుశా ఇంట పుట్టిందే అయి ఉండాలి. దేశాచారంబట్టి అయినా కాడిగట్టినట్లు కనబడడం లేదు. జతకుదర్చలేక ఊరుకున్నాడో ఏమో! ఒకటే ఎడ్లజత ఉండబట్టి అంత మోతుబరి కాడనుకోవచ్చు. అందుచేత ఎంత ప్రేమగా పెంచినా డబ్బు కాళపడవచ్చు. అయితే కొంపచూస్తే బ్రాహ్మణకొంప అనిపిస్తోంది. ఆంబోతుగా అచ్చు పొయ్యడానికి అట్టే పెట్టాడో ఏమో! భగవంతుడి దయ ఎట్లా ఉంటుందో! అంతా ఆయనదే భారం!" చెట్టుకింద చతికిలపడి నారాయణం మనసులో ఇట్లా గుంజాటనపడుతున్నాడు.

అంతలో ఊళ్లోకి వెళ్లిన వెంకాయి చొప్ప మోపుతో చక్కా వచ్చాడు. అతను తలమీది మోపు కింద పడవెయ్యకముందే "ఒరే వెంకా! లక్ష్మన్న కనపడ్డదిరా" అన్నాడు నారాయణం. మోపు అమాంతం కిందపడవేసి "ఎక్కడ ఎక్కడ, ఏదిఏది" అంటూ కంగారుపడ్డాడు వెంకాయి.

"రామన్నకు మేతవేసిరా, చెప్తాను"

ఒక్క ఊపున మోపుకట్లు తెంపేసి రామన్న ముందు మేత వేసి అత్యాతురతతో నారాయణం ముందు కూర్చున్నాడు వెంకాయి.

"ఏం చెప్పమంటావురా వెంకా? అంతా మన లక్ష్మన్నేరా! దాని పేరుగూడా లక్ష్మన్నేటరా! పైగా అది ఈఇంటిఆయనదేట! చూడు విచిత్రం. కలిసిరావడం అంటే ఇదేరా! మనం ఈ ఊరు వచ్చి వచ్చి ఇక్కడే మకాం వేశాము. మన తెలివితక్కువ చూశావా? మనపక్కన మనకు కావలసిందాన్ని పెట్టుకుని ఊళ్లో గొడ్లన్నీ వెదికాము. ఇంతకూ వేళ రావాలి! ఏమంటావ్? కాని, వెంకా, ఆయన అమ్మ నంటాడేమో అని లోపల అనుమానం బాధపెట్టుతోంది రా. ఇంతకూ నీ తెలివితేటలూ, మన అదృష్టమూ దీంతో బయటపడాలి."

"నా తెలివిలో ఏముంది బాబయ్యా! చేతిలో డబ్బుంటేసరి, కొండమీది కోతిగూడా దిగివస్తుంది."

"డబ్బుకేం భయం లేదురా వెంకా. ఇప్పటికి చేతిలో రెండువేలా అయిదు వందలకు పైగా ఉంది.

ఇంకా అవసరముంటే ఎల్లుండీపాటికి రాఘవయ్యకు తంతికొట్టి మఱింత తెప్పిస్తాను."

ఈమాట వినగానే వెంకాయిముఖం ఒకమాటు విప్పారి అంతలో వచ్చిన ఆలోచనతో కొంచెం ముంచించుకుంది. నారాయణాని కీమార్పు కనిపించ నియ్యకుండా వెంటనే సద్దుకుని "డబ్బు ఉందిగదా! ఇంకేం! మనకు దక్కక ఎక్కడికి పోతుందో చూస్తాను. ఏదీ! ఎద్దు ఇంటికాడ ఉందా ఇప్పుడు?" అన్నాడు.

"లేదురా! నువ్వు అటు వెళ్లాక నేను రామన్న దగ్గఱ నుంచున్నాను. అది మేతకు వెళ్తూ బైటికివచ్చి మన లక్ష్మన్న నుంచునేటట్లే రామన్నదగ్గఱ నుంచున్నదిరా. నేను రామన్నమీదే తలవంచి కళ్ళుమూసి నిలబడి ఉన్నాను. రెండూ ఒకదాని తరువాత ఒకటి అరిచేటప్పటికి ఆశ్చర్యపడి చూచాను. చూస్తే ఇది. ఎంత వింతోచూడు! అది సరాసరి మనదగ్గఱకే వచ్చింది. అయితే అది ఇప్పుడు మేతకు వెళ్లిందా, సందెవేళకు గాని రాదు. కాని నువ్వు పోయి ఆయన ఉన్నాడేమో చూచి, అమ్మతాడో అమ్మడో కనుక్కురా! తర్వాత మన మిద్దఱమూ వెళ్లి మాట్లాడుదాం."

వెంకాయి లేచి వేగంగా అడుగులు వేస్తూ ఆయన ఇంటి వేపుకు వెళ్లాడు.

ఆ ఇల్లు రోడ్డుకు పదిగజాలదూరంలో వుంది. చుట్టుపక్కల మఱో ఇల్లు ఏదీ లేదు. ఊళ్లో స్థలం దొరకకనో, వూరిబయట ఉండడం ఆరోగ్యకరమనో తన పొలంలో నేగాబోలు ఆబ్రాహ్మడు చిన్న పెంకుటి భవంతి వేసుకున్నాడు. దానికి చుట్టూ ప్రహరీగోడ లేదు. వీథివైపు వసారా వున్నది. వెంకాయి వెళ్లి వసారాదిగువనే పందిట్లో మెట్లదగ్గఱ నిలబడి "అమ్మగారూ" అని కేక వేశాడు. "ఎవరువారు?" అంటూ అయ్యగారే వచ్చి తలుపు తెరిచారు. ఆయన అప్పుడే భోజనం చేశాడు కాబోలు, త్రేన్చుతూ గుమ్మందాటి వసారాగుంజ నానుకుని నిలబడి "ఏవూరు మీది? ఎందుకు వచ్చావ్?" అని ప్రశ్నించాడు.

ఆయన కనబడిన దగ్గఱనుంచీ చేతులుజోడిస్తూ "దణ్ణాలు బాబయ్యా! మాది నర్సన్నపాలెం లెండి. నూజవీడు దగ్గఱ. తమకాడ ఒక ఒంటరెద్దు ఉన్నదని విని మా బాబుగారు పంపించారు" అన్నాడు వెంకాయి అతి వినయంగా.

ఆయన ఆశ్చర్యపడుతూ "అయ్యో! పాపం! అంతదూరంనుండి ఇంతవఱకూ వచ్చారా ఒక ఎద్దు కోసం!" అన్నాడు.

"అవునండి బాబయ్యా! మంచి భారీది దొరఎద్దు కావాలి. ఎక్కడా దొరకలేదు. ఇక్కడకు వచ్చాక తమకాడ ఉందని తెలిసింది. మా వెంబడి మా ఎద్దును గూడా తోలుకువచ్చాము. రెంటికీ జతకుదురుతుందేమో అని ఆశగా వుంది. ఏం సెలవు బాబయ్యా!"

ఈమాటలు వింటూ రోడ్డుమీది చెట్టువంకకు చూచాడు ఆబ్రాహ్మడు. ఆయనచూపు రామన్నమీదే పడింది, అక్కడే నిలిచిపోయింది.

వెంకాయిగూడా ఆవంకే చూస్తూ "ఆరే నండి మా బాబుగోరు. పిల్చుకురమ్మంటారా సామీ!" అన్నాడు.

ఆయన ఉలిక్కిపడి "పిలు! పిలు! ఇంకా చూస్తావేం? ఇవాళ పొద్దున్న లేస్తూనే గరుడదర్శనం చేశాను. వెతకబోయిన తీగ కాలికే తగిలింది" అన్నాడు.

వెంకాయి ఒక్క అంగన నారాయణాన్ని సమీపించి పిలుచుకువచ్చాడు. ఆబ్రాహ్మడు అతి సంభ్రమంతో ఇంట్లోకిపోయి ఒకచాప తెచ్చి వసారాలో గోడఅంచున వేసి నారాయణాన్ని ఆహ్వానించాడు. ఆగామి సౌఖ్యాన్ని అనుసంధించుకుంటూ ఒళ్లంతా గగుర్పొడవగా నారాయణం కూర్చున్నాడు. వెంకాయి ఎద్దు నూడదీసి ఆయనకు చూపించాలని ఇంటిముందుకు తీసుకువచ్చాడు. ఆబ్రాహ్మడు దాన్ని ఆవాలముఖపర్యంతం ఆశ్చర్యపడుతూ అవలోకించాడు. నారాయణాన్ని చూస్తున్న దానివీపుమీద చేత్తో రాస్తూ "పాలేరు చెప్పగా అన్ని సంగతులూ విన్నాను. నాదగ్గఱ ఒక దొరఎద్దు ఉంది. కాలి తీరూ, ఒంటితీరూ అంతా దీని మాదిరే! నాదాని జత కోసం కట్టిది కావాలని దాని చిన్నతనంనుంచీ వెతు

కుతూ వచ్చాను. ఇన్నాళ్లకు దీన్ని చూచే అదృష్టం కలిగింది" అన్నాడు ఆ బ్రాహ్మడు.

అకస్మాత్తుగా తీవ్రమైన చలిగాలి తగిలినట్లు నారాయణంఒళ్లు బిగుసుకుపోయింది. నోట మాట లేక గోడకు జేర్లబడి ఒరిగిపోయాడు. ఆబ్రాహ్మడు హడిలిపోయి కంగారుపడి నీళ్లు తెచ్చి ముఖాన చల్లి నానాపరిచర్యలూ చేశాడు. పావుగంటసేపటికి తెప్పిరిల్లిన నారాయణం కళ్లు తెరిచి నాలుగువైపులా పరిశీలించిచూచి తనవంకే చూస్తున్న రామన్నను చూచుకుని స్మృతిలోకి వచ్చాడు. ఎద్దును పట్టుకునుంచున్న వెంకాయిని చూచి "అమ్మయ్యా!" అనుకున్నాడు. పొడివుత్తరీయం చేత్తో పుచ్చుకుని "ఆ తడిది తీసి ఇది కప్పుకోండి" అంటున్న బ్రాహ్మడివంక తనవంక ప్రసరితమౌతున్న సానుభూతిని గుర్తిస్తూ చూశాడు. ఇతడు పడిపోవడం విని వసారాలో వచ్చి కూర్చున్న ఆ బ్రాహ్మడి తల్లి ఎనభై ఏళ్ల ముసలిది ఇతనివంక అతిజాలిగా చూచింది.

ఇంతలో రామన్న అంకె వేసింది. అది నాందిగా నారాయణం పూర్తి తెలివి తెచ్చుకున్నాడు.

ఇంకా నిల్చుండేఉన్న బ్రాహ్మణ్ణి చూస్తూ "గుడ్డ తడిస్తే ఇంతలో మునిగిపోయింది ఏమీ లేదు గానీండి సామీ తమరుగనక కూర్చుంటే ఒక్క మనవి చేసుకుంటాను"అన్నాడు నారాయణం.

ఆబ్రాహ్మడు అప్రయత్నంగా కూర్చుండిపోయాడు.

అప్పుడప్పుడు కన్నీళ్లు పెట్టుకుంటూ, మాటిమాటికీ రామన్నవంక చూస్తూ, డగ్గుత్తికవడ్డ గొంతుతో రామలక్ష్మణులకూ, తనకూ గల సుస్నిగ్ధభావాన్ని వివరించాడు నారాయణం. అతడు చెపుతున్నంతసేపూ ఆబ్రాహ్మడు అత్యాశ్చర్యంతో తన్మయుడై విన్నాడు. గోడనానుకున్న ముసలమ్మగూడా చెవులొగ్గి విన్నది.

"అట్లాంటి లక్ష్మన్న నన్నూ, రామన్ననూ విడిచిపెట్టి తనదారి తాను చూచుకుంది" అని నారాయణం దుఃఖంతో మాటరాక ఆగిపోయాడు.

వెంటనే రామన్న గాఢదుఃఖసూచకమైన ఒక్క అరుపు అరిచింది. అందఱూ ఆశ్చర్యపడి అటువైపే చూచారు.

ఒక్క నారాయణంమాత్రం మళ్లీ తనధోరణి అందుకుని "చూచారా బాబూ! దీని గుండెమెత్తదనం ఇట్లాంటిది. మనం ఏమనుకుంటున్నామో అంతా దానికి తెలుసు. లక్ష్మన్న పోయినప్పుడు దాంతో ఇదీ పోతుందనుకున్నాను. అట్లాకాక, స్వార్థం చంపుకుని రామన్న నాకోసం బతికిఉన్నది. నేను రామన్నను విడిచిపెట్టి బతకలేను. దాన్ని విడిచిపెట్టడమంటే నేను నాప్రాణాలు నాచేతులతో తీసుకోవడమే! ఇప్పటికే లక్ష్మన్న పోవడంతో సగంచచ్చి మిగతాసగం ప్రాణంతో రామన్నకోసం బతికిఉన్నాను. మీరు రామన్నమీద ఆశ సూచించినప్పుడు నాప్రాణం సొమ్మసిలిందంటే ఆశ్చర్యంలేదు. తమ దయవల్ల భగవంతుడు నన్ను బ్రదికించాడు. ఆయన నాకొక ధైర్యం చెప్పాడు. ఆ ధైర్యంతోనే ఈకథ అంతా తమకు విన్నవించుకున్నాను. ఇది వింటున్నంతసేపూ మీలో కలుగుతున్న ఆర్ద్రత గమనిస్తున్నాను. మీ రిక రామన్నను కోరలేరు. నా రామన్న ఇన్నాళ్లకు ఈఉదయాన మీలక్ష్మన్నఅయ్యి నాకింది. రామన్నా, లక్ష్మన్నా తమలో తాము మాట్లాడుకున్నాయి. అవి రెండూ ఒకటయాయి. రామన్న తిరిగి తన లక్ష్మన్నను సంపాదించుకుంది"అని అంటూ తన్మయుడై కళ్లు మూసుకున్నాడు.

ఆబ్రాహ్మడు తలవంచుకుని కొల్లాయిగుడ్డతో కళ్లనీళ్లు తుడుచుకున్నాడు.

అంతలో నారాయణం కళ్లు తెరిచి"ఏంబాబూ, చెప్పరేం? దీన్ని మీరు కాదనగలరా"అని అంటూ ఆయనచేతులు తన రెండుచేతులతోనూ పట్టుకున్నాడు. ఆ బ్రాహ్మడి గుండె నీరయిపోయింది. నోట మాట రాక గగ్గోలుపడ్డాడు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నారు? తమ ఔదార్యం వృథాపోదు. దీన్ని స్వీకరించి మమ్మల్ని ఆశీర్వదించండి"అని అంటూ పది వందరూపాయల నోట్లు ఆయనచేతుల్లో పెట్టాడు నారాయణం.

తన ఎద్దు అయిదువందల విలువచెయ్యడమే ఘనమనుకుంటున్న ఆబ్రాహ్మడు ఇంతసొమ్ముచూచి మఱీ నిశ్చేష్టుడైపోయాడు. నారాయణం ముడిచి పెట్టిన ఆయనచేతులు తమంతటతామే విడివడి కాగితాలు కిందికి జారిపోయాయి.

అప్పటికి సందవేళ అయింది. లక్ష్మన్న వస్తూనే అంకెవేసి రామన్నను పిలిచింది. రామన్న తిరిగి అంకెవేసి లక్ష్మన్న నాహ్వానించింది. అవి రెండూ ఒకదాన్నొకటి మూచూచుకున్నాయి. ఒండొంటితో ఒరసికొని గాఢాశ్లేషం కావించుకున్నాయి. ముఖంలో ముఖం పెట్టి చూచుకుని హృదయాలు కలుపుకున్నాయి. ఒక కంచంలోనే తినే అన్నదమ్ములవలె మాతీమాతీ కలుపుకుంటూ ఒక పొగులోనుంచే చొప్పదంట్లు లాగి నమిలాయి.

ఆ బ్రాహ్మడు ఆపుకోలేని తమకంతో "శుభమస్తు నిత్యం" అని మనసులో ఆశీర్వదించాడు.

పాలు తీసి పశువులను కట్టివేసి ఇంటికివెళ్తున్న గొల్లకుఱ్ఱవాణ్ని పిలిచి "నీమాట నిలబెట్టుకున్నావురా" అంటూ మఱొక పదిరూపాయలనోటు అతని చేతిలో పెట్టాడు నారాయణం. వాడు విస్మితుడై పిచ్చిచూపులు చూస్తూ నమస్కరించి వెళ్లిపోయాడు.

ఎప్పుడు వెళ్లాడో, ఎటు వెళ్లాడో ఏమో అంతకుముందు చాలాసేపటినుంచీ వెంకాయి అక్కడ లేడు.

౬

ఆ బ్రాహ్మడు ఎంత బలవంతంచేసినా ఆరాత్రి నారాయణం ఇంట్లో పడుకోడానికి ఒప్పుకోలేదు. ఎడ్లను పాకలో కట్టివెయ్యడానికీ ఒప్పుకోలేదు. తాను వాకిటివసారాలోనే ఆయన ఇచ్చిన మడతమంచంమీద పక్క వేసుకున్నాడు. ఎడ్లను రెంటినీ వసారాకు దిగువగా గుంజలు పాతించి కట్టివేశాడు. మంచంమీద కూర్చుంటే చేతికి ఎడ్లతలలు అందేటంత చివఱగా వసారాఅంచువెంబడే మంచం వేసుకున్నాడు. ఆ బ్రాహ్మణాయన భోజనం అయేవఱకూ అప్పుడప్పుడు ఎడ్లవీపులు నిమురుతూ, అఱ్ఱులుగోకుతూ, కొంతసేపుకూర్చుని వాటినిగూర్చి కలలుగంటూ, అన్నింటికీ మధ్యమధ్య పోయిన లక్ష్మన్నను జ్ఞాపకంచేసుకుంటూ కాలక్షేపం చేశాడు.

అంతలో ఆబ్రాహ్మడు మధ్యసావడిలో పీట వేయించి భోజనానికి లెమ్మన్నాడు నారాయణాన్ని. "ఇక్కడే పెట్టించండి బాబూ! ఎడ్లను చూసుకుంటూ తింటాను" అన్నాడు నారాయణం. వేసిన విస్తరి తియ్యకం తప్ప అనుకుంటూనే ఆయన నారాయణం మాటలోని గాఢత గమనించి తప్పనిసరియై వసారాలోనే భోజనం పెట్టించాడు.

నారాయణం ఇటు భోజనంచేసి లేచాడో లేదో అటు వెంకాయి తూలుకుంటూ, చీకట్లో తడబడుతూ చక్కా వచ్చాడు. ఇంతవఱకూ నారాయణానికి వెంకాయినిగుఱించిన ఊహే రాలేదు. వెంకాయితత్వం తెలుసుకాబట్టి నారాయణం వాణ్ని పలకరించనేలేదు. వెంకాయి వచ్చివచ్చి ఎడ్లనుకట్టిన వసారాముందటి పందిట్లోనే అటుపక్కగా గోడనానుకుని కూలబడ్డాడు. తూలుతున్న వెంకాయిని చూచి ఏదో అనబోయిన ఆబ్రాహ్మణ్ని చెయ్యిచూపి వారించాడు నారాయణం. నారాయణం వసారాలోకి రావడంతోటే మెల్లగా "మఱి భోజనమాటేమిటి" అన్నాడు ఆయన. "దానికేం లెండి! ఏదో తినేవచ్చి ఉంటాడు. అంతగా తినకపోతే నేను పెడ్తాను. ఒక విస్తట్లో పెట్టించి ఈ మూల పెట్టించండి" అన్నాడు నారాయణం. సంగతి గ్రహించి ఆబ్రాహ్మడు అట్లాగే పెట్టించాడు.

ఆయనా, నారాయణం వసారాలో కూర్చుని కొంతసేపు లోకాభిరామాయణం చెప్పుకున్నారు. ప్రసంగంలో నారాయణం అచింతితంగానే వెంకాయినిగూర్చి అదీఇదీ కొంత కొంత చెప్పాడు. అప్పటికి రాత్రి పదిగంటలయింది. ఎంత సరిపుచ్చుకున్నా ఈ అమావాస్య చీకట్లో, తనది ఊరిబయట ఇల్లుకూడానాయె, నారాయణాన్ని అట్లా వీథివసారాలో పడుకోనివ్వడానికి ఆయనమనస్సు ఏమాత్రమూ ఒప్పుకోలేదు. వెంకాయి తాగిరావడం, నారాయణం అతన్ని గుఱించి కొంతచెప్పడం వీటితో ఆయనకు నిజంగానే భయం

తోచి "ఎడ్లను పాకలో కట్టివేయిస్తాను. మీరు లోపల పడుకోవలసింది" అని ఎంతెంతో బతిమాలుకున్నాడు పాపం. నారాయణం తనకోసం కాకపోయినా ఆయన కోసమైనా అంగీకరించలేదు. ఆయన సూచించిన భయాన్నికూడా అదీఇదీచెప్పి పరాభూతం చేశాడు. చివఱకు ఆ బ్రాహ్మడు భగవంతునిదయ గాఢంగా అర్థిస్తూ వెళ్ళలేక వెళ్ళలేక లోపలికి వెళ్లి తలుపువేసుకున్నాడు.

వెంకాయికి ఈ లక్ష్మణాన్వేషణ ప్రయాణంలో నారాయణంమొహం తప్పించి తిరగడానికే అవకాశం లేకపోయింది ఈనాటివఱకూ! ఒకటి రెండు పెద్ద ఊళ్లల్లో రెండు మూడు రోజులవఱకూ ఆగారుకాని వెతకాలన్న తీవ్రతలో ఉన్న నారాయణం వెంకాయిని వెంటబెట్టుకునే తిరగడంవల్ల అతనికి వెసులుబాటు చిక్కనేలేదు. ఇంతదాకా వచ్చి ఈఊళ్లో నారాయణం నిరుత్సాహంతో, నిరాశతో చచ్చుబడడంవల్ల ఉదయమే ఊరువెంబడి పనిమీద రెండుమాట్లు తిరిగిరావడమూ, సాయంకాలానికి ఆశగా కనిపించిన ప్రయత్నఫలం దక్కేదీ దక్కందీ తేలేవఱకూ ఈ ఊళ్లోనే తిష్ఠవేసే అవకాశం ఏర్పడడంవల్ల ఈ వాహ్యాళి పోగలగడమూ సాధ్యమయాయి వెంకాయికి. ఆసాయంత్రం వెంకాయి పగలు ఎద్దుమేతకనీ, చుట్టపొగాక్కనీ నారాయణం ఇచ్చిన డబ్బుల్లో తాను మిగుల్చుకున్న ఎనిమిదణాలూ సురాదేవతకు మన్నపూర్వకంగా సమర్పించుకున్నాడు. ఆ తాగిన తాగుడులో వెంకాయి తాను ఈఊరు వచ్చిన విషయమే మఱచిపోయాడు మొదట. అతనిమనస్సు అతని ప్రియురాలిపై పుకే వెళ్లింది. "ఓసి నారాణీ"అంటూ వెఱ్ఱికేకలు వేశాడు వీథివెంబడి నడుస్తూ. మైకంలో తెలివి వచ్చి అతని మనసులో ఏదో మెఱుపు మెఱిసినట్లయింది. తానీప్రయాణానికి బయలుదేరబోయేముందు తన ప్రేయసితో తానన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి. అతని బుఱ్ఱ ఆలోచనలతో–అంటే లోపల ఊహించేవిగావు, బయటికి అనేవాటితోనే–వేడెక్కిపోయింది. పదినిమిషాలు కాకముందే అతని కళ్లకు తనరాణికి రాణైన తాను కట్టించిఇచ్చిన మేడ కనిపించింది. ఇక ఆ పిమ్మట వెంకాయి ఏంచేశాడో చేశాడు. ఆరాత్రివేళ ఇంటికిమాత్రం అట్లా వచ్చిపడిపోయాడు.

నారాయణం మంచంమీద నడుం వాల్చాడే కాని ఇంకా నిద్రపట్టలేదు. రెండు మూడు మాట్లు అటూ ఇటూ దొర్లి ఎడ్లవంక చూచేటప్పటికి దీపపు వెలుగులో అప్పుడే లేచి అక్కడ నిలబడ్డ వెంకాయి కనిపించాడు. నారాయణం లేచికూర్చుని "ఏరా వెంకా! అన్నం తింటావురా?" అన్నాడు. వెంకాయి తల ఆడించాడు. నారాయణం లేచి మూలనున్న విస్తరి తీసి మెట్లదిగువను పెట్టి దీపం అక్కడ పెట్టాడు. అయిదు నిమిషాల్లో వెంకాయి భోజనంచేసి లేచాడు. నారాయణం పక్కమీదే కూర్చుని ఆవులిస్తూ "దీపం పైనపెట్టి తగ్గించి పడుకో వెంకా" అని తాను నడుంవాల్చాడు. అతడు చెప్పినట్లుగా దీపం పెట్టి వెంకాయి పందిరికిందే కాళ్లుముడుచుకు తొంగున్నాడు.

అప్పటికి ఒంటిగంటే దాటిందో, రెండే అయిందో. లేక ఇంకా ఎక్కువే అయిందేమో! అంతా కారుచీకటి. అతినిశ్శబ్దం. అక్కడక్కడ మిణుగురు పురుగుల మెఱుగూ, కీచురాళ్ల ధ్వనీ దృక్ఛ్రోత్రగోచరా లవుతున్నాయి. రామలక్ష్మణులిద్దఱూ గ్రామగన్ను వెట్టి నిద్రపోతున్నారు. దూరాన చెట్లనుండి గుడ్లగూబల కూతలూ, వానినోటబడ్డ కాకిపిల్లల అరుపులూ ఆ రాత్రివేళ మేల్కొన్నవారికి భయాన్ని కలిగిస్తున్నాయి. ఆచీకట్లో ఇంటిముందు చింతచెట్టు మహాభయంకరంగా ఉంది. దాన్ని ఆనుకుని పెరిగి దానికొమ్మల్లో తలదూర్చిన తాడిచెట్టు ఎవడో క్రూరుడు పొంచిచూస్తున్న భ్రాంతి కలిగిస్తోంది.

నిర్మానుష్యమైన ఆప్రదేశంలో ఆవేళ రెండు చీకటిముద్దలు కదిలాయి. ఒక సన్నని ఈల వినరావడంతో పందిట్లో తొంగున్న మూడో చీకటిముద్ద లేచింది. అది మెల్లమెల్లగా అడుగులు వేస్తూ ఆ మొదటి రెంటిలో ఐక్యమయింది. ఆ మొత్తం ముద్ద మళ్లీ రెండుగా చీలింది మఱునిమిషంలో. అందులో చిన్నముద్ద ఇంటివెనక్కి వెళ్లింది. మిగిలిన పెద్దముద్ద

వసారాలో ప్రవేశించి రెండు సమానభాగాలుగా చీలింది. వసారాలోని సన్నని దీపపువెలుగులో ఆ చీలినభాగాలు చీకటిముద్దతనం గోల్పోయి భయంకర మనుష్యరూపం తాల్చాయి. అత్యల్ప కాలంలో అంతా ఒకటే చీకటిముద్ద అయింది. ఇన్నాళ్లుగా ఇంతదేశం తిరిగితిరిగి అలిసిపోయి తుట్టతుదకు పూనిన పని ఫలించిన ఆనందంలో అతిగాఢనిద్రనందుతున్న నారాయణం పడుకున్న మంచం తలవైపునా, కాళ్ల వైపునా కఱ్ఱలుకట్టి ఎత్తబడగా మడతబడకుండా మెల్లగా కదిలింది. మెట్లుదిగుతుండగా ఒకకోడు మెట్టుకు తగిలి కొంచెం శబ్ద మయింది. మంచంమీది దుప్పటి ఏమాత్రమూ కదలలేదు. కాని రామన్న హఠాత్తుగా లేచి నిలబడింది. వెంటనే లక్ష్మన్న లేచింది. హడావిడిపడి మంచం చరచరా చింతచెట్టు దాటిపోయింది. ఎడ్లులేచిన ధ్వని విని ఇంటివెనుకకు వెళ్లిన చీకటిముద్ద ఇంటిముందుకు వచ్చింది. కన్ను పొడుచుకున్నా కానరాని ఆచీకట్లో మంచంవెళ్లిన వైపు తిరిగి తలతాళ్లు లాక్కుంటున్న ఎడ్లకళ్లల్లో చంద్రహాసం మెఱిసింది. ఆముద్ద అటు కదిలిందో లేదో ఇటు రెంటి తలత్రాళ్లూ తెగిపోయాయి. రామన్న ముందూ, లక్ష్మన్న వెనకా మంచంవెళ్లిన వైపు పరుగుదీశాయి. ఇవి వస్తున్న వేగానికి హడిలి ముందుపోయిన చీకటిముద్ద చింతచెట్టులో కలిసిపోయింది. దూరాన వస్తున్న వీటిని చూచి మంచం చటుక్కున ఆగిపోయింది. కాని రెండుమెఱుపులు ఒక్కసారి మెఱిశాయి. హఠాత్తుగా ఆగడంలో అయిన కుదుపూ, రామలక్ష్మణులు రివ్వున దూసుకువస్తూ ఉండడంలో అయిన ధ్వనీ మంచంమీది నారాయణానికి మెలకువ తెచ్చాయి. వెంటనే అతని మొహాన గుడ్డపడింది; చేతులు వెనక్కు విరువబడ్డాయి. పెనగులాటలో నారాయణం మంచంమీకి తన్ను పట్టుకుంటున్న వ్యక్తిని పది అడుగులు రోడ్డుమీదికి లాక్కురాగలిగాడుగాని లొంగిపోక తప్పిందికాదు. ఆవ్యక్తి నారాయణాన్ని నేలమీద పడవేసి నోట గుడ్డలుకుక్కి చేతులూ, కాళ్లూ కట్టివేసేశాడు. అతని ఒళ్లంతా దేనికోసమో వెతికాడుగాని ఏమీ దొరకలేదు. అంతలో తమ్ము అడ్డడానికి వచ్చిన వ్యక్తిని తప్పించుకుని రామన్న ముందుకు వచ్చేసింది. తనమీదికి వస్తున్న లక్ష్మన్నపైకి ముందువెళ్లిన వ్యక్తి కత్తి ఎత్తాడు. లక్ష్మన్న అతని కత్తికి తనకొమ్ము బలియిచ్చి, రెండో కొమ్ముతో డొక్కలో పొడిచి ఎత్తి ఆకాశానికి ఎగరవేసింది. క్రిందపడి ప్రాణంవిడిచిన అతన్ని తొక్కుకుంటూనే లక్ష్మన్న రామన్నను కలుసుకుంది. పొడవవచ్చిన రామన్నను నారాయణందగ్గఱనుండి లేవబోయిన వ్యక్తి కత్తితో వేశాడు. ఆకత్తి ఒక కొమ్మును నరికి రెండోకొమ్ముమొదట్లో వాలుగా రామన్నతలమీద గాయంచేసింది. గాయంకావడంతో పొంగిన ఉద్రేకంతో మీదికిదూకిన రామన్నధాటి కాగలేక ఆవ్యక్తి కత్తిజారవిడిచి నేలమీద పడిపోయాడు. పడడంలోనే దెబ్బతగిలి అతని తల నెత్తురు కారింది. కాని మళ్లీ లేవబోయిన అతన్ని తన దెబ్బతిన్న తలతోనే తిరిగి ఎన్నటికీ లేవకుండా చేసింది. వెంటనే పది అడుగుల దూరంలో పడివున్న నారాయణాన్ని మూచూచింది రామన్న. నారాయణం మాటరాక తల ఆడించాడు. అతని ముఖాన మూతిపెట్టి నోటిలో గుడ్డలు లాగివేసింది రామన్న. తన మొహాన నెత్తురుకారుతుండగా అతనితలవైపు తన ముఖం పెట్టి తన నాలుగు కాళ్లసందునా అతన్ని ఇముడ్చుకుని అక్కడే నిలబడిపోయింది రామన్న. అట్లా నిలబడ్డ రామన్నను లక్ష్మన్న కలుసుకుంది. రెండు మూతులూ ఒకమాటు కలిశాయి. అంతలో ఎక్కడో చప్పుడయింది. లక్ష్మన్న వెనుదిరిగిచూచింది. చింతచెట్టు దిగి ఎవడో మనిషి పారిపోతున్నాడు. లక్ష్మన్న అతని వెంబడి పడలేదు. రామన్నచుట్టూ ప్రదక్షిణం చెయ్యటం మొదలుపెట్టింది.

అప్పుడు నాలుగుగంటలవేళ అయింది. ఆ రోడ్డున ఆనాడు అంతవఱకూ ఎవ్వరూ రాలేదు. అప్పుడే లేచిన ఆఇంటి బ్రాహ్మడు తలుపుతెరిచి వసారాలో అడుగుబెట్టాడు. నారాయణం మంచంగాని, ఎడ్లుగానిలేకపోవడంతో కంగారుపడ్డాడు. గజగజలాడుతున్న శరీరంతో పైమీదగుడ్డ అయినా లేకుండానే రోడ్డువైపుకి పరుగెత్తాడు. ఫర్లాంగుదూరంలో రోడ్డు కడ్డం

తిరిగిఉన్న లక్ష్మన్నా, దానివెనుక వెలుగుతున్న దీపాలతో ఆగిపోయినకారూ కనిపించాయి. దారిలో పడి ఉన్న శవాన్నైనా చూడకుండా ఆ బ్రాహ్మడు అక్కడికి పరుగెత్తాడు. కారు ఆగడంతోనే రామన్న వెనక్కు నాలుగుఅడుగులు వేసి నారాయణాన్ని ఆపాదమస్తకం చూస్తూ నిలబడింది. ఆ కారులో నంది గామపోలీసుఅధికారులు ఉన్నారు. వారి అందటి మనస్సులనూ ఆశ్చర్యం ఒక్కటే ఆవరించింది. కొందఱు ఇటుపక్క శవాన్ని మూచి దానివైపుకు వెళ్లారు. మఱికొందఱు కట్టివేయబడిఉన్న నారాయణాన్ని చూచి అతని కట్లు విప్పారు. నారాయణం తనకు మెలకువవచ్చినదగ్గఱనుంచీ తెలిసింది అంతా చెప్పాడు. ఎవ్వరూ నమ్మడానికి వీల్లేని విషయం. కాని లక్ష్మన్న తమకారును రోడ్డుకు అడ్డంనిలిచి ఆపివేయడమూ, తమ కారు ఆగడంతోటే రామన్న వెనక్కు అడుగులు వేసి నారాయణాన్ని చూపించడమూ తామందఱూ తమ కళ్లతో చూచిన విషయాలు. తక్కినది కాదనడానికి ఎట్లా వీలు? ఆదరబాదరగా అప్పుడు పరుగెత్తుకు వచ్చిన ఆ బ్రాహ్మడు ఈరంగానికి పూర్వకథ అంతా చెప్పి సాక్ష్యమిచ్చాడు. ఎద్దుకొఱకు నారాయణం ఇచ్చిన వెయ్యీ, రాత్రి జాగ్రత్తచెయ్యమని ఇచ్చిన తక్కినసొమ్మూ ఇంటిదగ్గఱ ఉన్నది, చూపిస్తాను రండి అన్నాడు. పోలీసులు రెండుశవాల్నీ పరిశోధించారు. ఒకశవంపొట్టమీద నెత్తురుమరక లున్నాయి. కత్తి దెబ్బ ఏమో అని పరీక్షించారు. కాని కాదు. రామన్న ముఖం నెత్తురుకారుతోంది. నారాయణం చెప్పినట్లు దాన్నీ దీన్నీ కలుపుకున్నారు. ఆశవంతలే పగిలి ఉంది. అది హఠాత్తుగా కిందపడడం ఫలితంగా నిజమే ఊహించారు. అది అతని పాలేరు వెంకాయి శవమట! శవపరీక్షా, నారాయణమూ బ్రాహ్మడూ చెప్పిన విషయాలూ, అన్నింటికంటే తాము చేసిన పనికి సూచకంగా ఎడ్లు రెండూ తమఎదుట ప్రదర్శించిన చేష్టలూ అన్నీ ఒకవిషయాన్నే నిశ్చయించాయి. పోలీసువారు ఆశ్చర్యపడుతూ సమస్తమూ నమ్మవలసి వచ్చింది.

తెల్లవారింది. నందిగామ ఊరంతా అక్కడే పోగుపడింది. వెంకాయిశవానికి అంత్యక్రియలు తానే చేయిస్తానన్నాడు నారాయణం. రెండోశవానికి సంబంధించినవారు వచ్చి అడగగా ఊరిపెద్దల సమక్షంలో పోలీసువారు ఇచ్చివేశారు.

ఆనాడు నారాయణం తనదగ్గఱ మిగిలిన సొమ్మంతా వెచ్చించి ఆ బ్రాహ్మడి సహాయంతో రామలక్ష్మణులపేరట అన్నదానం చేశాడు. ఆసమారాధనలో నారాయణధనాపహరణప్రయత్నం లో పాల్గొన్న మూడవ వ్యక్తిగూడా కూడుగుడవకపోలేదు. నారాయణం చేసిన ఈ అన్నదానఫలితంలో చచ్చిన వెంకాయికిగూడా కొంతభాగం దక్కకపోదు.

రెండురోజులు గడిచాక నారాయణం దారిఖర్చులకు ఆ బ్రాహ్మడిదగ్గఱ కొంతసొమ్ము తీసుకుని, సీతాయి కన్యాయం జరిగిన బాధతోనూ, పోయిన లక్ష్మన్న మఱోశరీరంతో తనకూ రామన్నకూ తిరిగి లభించిన సంతోషంతోనూ సర్వాలంకారశోభితులైన రామలక్ష్మణులను ముందు నడుపుకుంటూ స్వగ్రామోన్ముఖుడయ్యాడు.

